ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 19 నవంబరు 2024 | 5



కార్తీక దీపోత్సవం



రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్‌లో సోమవారం రాత్రి లక్ష దీపోత్సవంలో దీపాల వరుస - 6లో

అభిషేకాలు.. విశేష పూజలు



కార్తీకమాసం మూడో సోమవారం జిల్లాలోని శివాలయాలన్నీ భక్తజనంతో కిటకిటలాడాయి. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధన, విశేష పూజా కార్యక్రమాలను ఆలయాల వద్ద నిర్వహించారు. ప్రధానంగా దక్షిణకాశీగా పేరొందిన పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఆ దృశ్యాలే ఇవి.. పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం.. శివలింగానికి జలాభిషేకం. -8లో

'గిరి' చెరిగేనా..

- జిల్లాలో సబ్‌ప్లాన్ ఏజెన్సీ మండలాల గిరిజనుల కష్టాలకు మోక్షం ఇంకెప్పుడో
- ఇన్నాళ్లకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే ద్వారా అసెంబ్లీ దృష్టికి ఆదివాసీల కష్టాలు
- 2022లో జిల్లాల విభజన నాటి నుంచి సబ్‌ప్లాన్ ఏజెన్సీకి ఐటీడీఏ నిల్
- మైదాన ప్రాంతం పరిధిలోకి వచ్చేయడంతో షెడ్యూల్ ఏరియా గుర్తింపు మాయం



రౌతులపూడి మండలంలోని ఓ సబ్‌ప్లాన్ గ్రామం

జిల్లాలో సబ్‌ప్లాన్ ఏజెన్సీలోని గిరిజనుల కష్టాలకు ఏళ్లు గడుస్తున్నా పరిష్కారం లభించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా ఐటీడీఏ కోల్పోయిన ఆదివాసీలు ఇప్పటికీ దాన్ని పొందలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో అధికారులు ఇక్కడి గిరిజనులకు ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని నివేదికలు పంపినా ప్రభుత్వ పెద్దలు వాటిని చెత్తబుట్టలో పడేశారు. దీంతో రెండున్నరేళ్లు దాటిపోయినా ఇప్పటికీ దిక్కుమొక్కులేక ఈసురోమంటు న్నారు. అయితే తాజాగా వీరి కష్టాలను అసెంబ్లీలో ప్రత్తిపాడు టీడీపీ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రస్తావించడంతో తమకు న్యాయం జరుగుతుందనే ఆశ ఆదివాసీల్లో మళ్లీ చిగురిస్తోంది. ఐటీడీఏ ఏర్పాటు చేయడం, లేదా దానికి సమానంగా లబ్ధి చేకూర్చాలని వేడుకుంటున్నారు. అటు జిల్లా మంత్రి పవన్‌కల్యాణ్ సైతం చొరవ తీసుకుని తమ సమస్యకు పరిష్కారం చూపాలని 59 గ్రామాల్లోని 28 వేల మంది ఆదివాసీలు కోరుతున్నారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం 2022లో రాష్ట్రంలో జిల్లాల విభజన చేపట్టింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాస్తా నాలుగు జిల్లాలుగా ఏర్పడింది. అప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో భాగంగా ఐటీడీఏ కేంద్రంగా ఉన్న రంపచోడవరం విడిపోయి కొత్తగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలిసింది. దీంతో తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలోని 59 సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలు ఐటీడీఏ నుంచి విడిపోయాయి. ఇవన్నీ సరిహద్దు మారి కాకినాడ జిల్లా పరిధిలోకి వచ్చాయి. రంపచోడవరం ఐటీడీఏ అల్లూరి జిల్లాలోకి వెళ్లిపోవడంతో కాకినాడ జిల్లాకు ఐటీడీఏ లేకుండా పోయింది. ఫలితంగా జిల్లాలోని ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని నియోజకవర్గాల పరిధిలోని పది మండలాల పరిధిలో గల 59 గ్రామాల్లో 28 వేల మంది గిరిజనులు ఐటీడీఏ కోల్పోయారు. జిల్లా మారిపోవడంతో ఈ గిరిజనులతో ఇకపై తమకు సంబంధం లేదని రంపచోడవరం ఐటీడీఏ 2022 ఏడాది చివర్లో చేతులు దులిపేసుకుంది. 59 సబ్‌ప్లాన్ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, సమస్యలు, గిరిజనుల ఉద్యోగాల రిజర్వేషన్ ఏదీ తమకు సంబంధం లేదని అప్పట్లో అధికారులు తేల్చేశారు. ఫలితంగా ఏ సమస్య వచ్చినా తమను అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో జిల్లా పరిధిలోని గిరిజనుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వాస్తవానికి ఇంతకుమునుపు ఈ గ్రామాలన్నీ ఎన్నో ఏళ్లుగా రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ మండలాలుగా కొనసాగేవి. వీరందరి బాగోగులు ఐటీడీఏ చూసేది. విద్య, వైద్యం,రహదారుల సౌకర్యం మొదలు తాగునీటి వసతి, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, ప్రభుత్వ ఉద్యోగాల రిజర్వేషన్ వరకు అన్నీ వర్తింపచేసేది. తీరా 2022 నుంచి ఐటీడీఏ పరిధి కోల్పోవడంతో 59 గ్రామాల్లోని గిరిజనులంతా మైదాన ప్రాంత గిరిజనులుగా మారిపోయారు. దీంతో షెడ్యూల్ తెగల ఏరియా హోదా పోయి గిరిజనుల కోటా కింద వచ్చే ప్రయోజనాలన్నీ పోయాయి.

ఈనేపథ్యంలో 28 వేల మంది గిరిజనులు తమను కాకినాడ జిల్లా నుంచి తప్పించి అల్లూరి జిల్లాలో కలపాలని అప్పటి నుంచీ డిమాండ్ చేస్తున్నారు. గ్రామ సభల్లో తీర్మానాలు చేసి అప్పటి కలెక్టర్‌కు కూడా పంపించారు. అలాగే 59 గ్రామాల పరిధిలోని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు సైతం వీరి న్యాయపరమైన డిమాండ్ కోసం ఆందోళకు మద్దతిచ్చారు. షెడ్యూల్ ఏరియాగా గుర్తించాలంటూ జిల్లా పరిషత్‌లో తీర్మానించారు. ఈనేపథ్యంలో షెడ్యూల్ ఏరియాగా గుర్తించాలా? లేదా? అనేదానిపై రంపచోడవరం ఐటీడీఏ పీవో నుంచి అప్పటి కాకినాడ కలెక్టర్ నివేదిక కోరారు. దీనిపై అధ్యయనం చేసిన ఐటీడీఏ అధికారులు 2023లో నివేదిక సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపారు. 59 గ్రామాల్లో 56 గ్రామాలనే గిరిజన ప్రాంతాలుగా గుర్తించొచ్చని సిఫార్సు చేశారు. వీరంతా గిరిజనులే కాబట్టి ఐటీడీఏ విడిపోవడంతో వీరు నివసిస్తోన్న గ్రామాలను గిరిజన తెగ గ్రామాలుగా ప్రకటించాలని నివేదికలో పేర్కొన్నారు. అయితే వీరికి ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయడమా? లేదా షెడ్యూల్ ఏరియాగా గుర్తించి ఐటీడీఏ లేకుండా పథకాలు అమలు చేయడమా? అనేదానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని నివేదికలో ప్రస్తావించారు. అలాగే కాకినాడ జిల్లాలో మండలాల వారీగా ఏయే గ్రామంలో ఎంతమంది ఆదివాసీలు ఉన్నారో జనాభా లెక్కలు కూడా నివేదికలో పొందుపరిచారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్నప్పుడు 56 గ్రామాలకు చేసిన ఖర్చు-గ్రామాల్లో సామాజికవర్గాల వారీగా జనాభా తదితర విశ్లేషణలు కూడా క్రోడీకరించారు. జిల్లాలో 56 గ్రామాలను గిరిజన ప్రాంతాలుగా గుర్తించడానికి రంపచోడవరం ఐటీడీఏ అభ్యంతరం లేదని నివేదిక పంపిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ నుంచి కూడా సిఫార్సులతో కూడిన నివేదిక 2023లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లింది. ఈ నివేదిక కూడా గిరిజనులకు అనుకూలంగానే ఉంది. జిల్లా గిరిజన సంక్షేమశాఖ సైతం ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని నివేదిక పంపింది.

అయితే త్వరలో అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకోబోతోందని అధికారులు భావించారు. కానీ నెలలు గడిచినా కనీసం వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇక్కడి నుంచి అమరావతికి వెళ్లిన నివేదికలను రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వ పరిశీలనకు పంపితే వాటన్నింటిని మూలనపడేసింది. అప్పటి మంత్రి దాడిశెట్టి రాజా, సంబంధిత సబ్‌ప్లాన్ ఏజెన్సీ మండలాల పరిధిలోని ఎమ్మెల్యేలు కూడా ప్రభుత్వంపై కనీసం ఒత్తిడి తేలేదు. ఫలితంగా సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల గిరిజనులు నిలువునా నష్టపోయారు.

అసెంబ్లీలో ప్రస్తావనతో ఆశలు

తాజాగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అసెంబ్లీలో సబ్‌ప్లాన్ ఏజెన్సీ అంశం లేవనెత్తడంతో మళ్లీ గిరిజనుల్లో ఆశలు రేకెత్తాయి. జిల్లాల విభజనతో రంపచోడవరం ఐటీడీఏ కాకినాడ జిల్లాలోని గిరిజనులను పట్టించుకోవడం లేదని, దీనివల్ల అన్నివిధాలా గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని సభ దృష్టికి తీసుకువెళ్లారు. వీరికి ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో 59 గ్రామాల్లోని 28 వేల ఆదివాసీల కష్టాలు అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం దృష్టికి వెళ్లినట్టయింది. అలాగే సీఎం చంద్రబాబును సైతం కలిసి ఎమ్మెల్యే సత్యప్రభ ఈ విషయాన్ని వివరించారు. గత ప్రభుత్వం వీరిని మోసం చేసిందని, ఇప్పుడు సమస్య తీవ్రత దృష్ట్యా వీరికి న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కాగా త్వరలో సీఎం అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు జరగనుండడంతో ఈ అంశం చర్చకు వచ్చే అవకాశం ఉందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు భావిస్తున్నారు. అటు జిల్లా మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సైతం ఈ మూడు నియోజకవర్గాల్లోని గిరిజనుల బాధలను దృష్టిలో ఉంచుకుని చొరవ తీసుకోవాలని గిరిజన నేతలు కోరుతున్నారు.

2 గంటల్లో.. ముంబయి వెళ్లొచ్చు!

త్వరలోనే ఢిల్లీకీ విమాన ప్రయాణం



రాజమహేంద్రవరం నుంచి ముంబయికి వెళ్లాలంటే ఖచ్చితంగా 48 గంటలు పడుతుంది.. ఎందుకంటే రైలులో ప్రయాణం కదా.. ఇక నుంచి అలా అవసరం లేదు.. కేవలం రెండు గంటల్లో ముంబయి చేరుకోవచ్చు. అయితే డిసెంబరు ఒకటో తేదీ వరకూ ఆగాల్సిందే మరి.. ఎందుకంటే ఆ రోజు నుంచి రాజమహేంద్రవరం టు ముంబయికి ఎయిర్‌బస్‌లు అందుబాటులోకి రానున్నాయి.. ఏకంగా 180 సిట్టింగ్‌తో అటూ ఇటూ తిరిగేందుకు సిద్ధం చేస్తున్నారు.. అదే నెల 12వ తేదీ నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు రానున్నాయి.. వచ్చే నెల నుంచి ముంబయి, ఢిల్లీకి గాలిలో ఎగిరిపోదాం.. - 7లో



అరాచక శక్తుల కట్టడికి ప్రత్యేక చట్టాలు అవసరం

శాసన మండలి నేత యనమల రామకృష్ణుడు

తుని రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): అరాచక శక్తుల కట్టడికి ప్రత్యేక చట్టాలు అవసరమని టీడీపీ సీనియర్ నాయకుడు, శాసనమండలి నేత యనమల రామకృష్ణుడు స్పష్టంచేశారు. సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు వ్యక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నాయని, దీన్ని కట్టడి చేయకపోతే అరాచకాలు రాజ్యమేలే ప్రమాదం ఉందని శాసన మండలిలో యనమల ఆందోళన వెలిబుచ్చారు. దీనికి ముకుతాడు వేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఒకరి వల్ల మరొకరి ప్రతిష్ఠగానీ, మనోభావాలు గానీ దెబ్బతినకూడదని, ఆయా వ్యక్తుల ప్రతిష్ఠ దెబ్బతినకుండా ప్రభుత్వం ఏ చర్య తీసుకున్న తప్పేమీ కాదన్నారు.



మత్స్యకారుల సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే దివ్య గళం

తుని రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సమస్యలపై ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యనమల దివ్య అసెంబ్లీలో గళమెత్తారు. జాలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా తుని నియోజకవర్గం తొండంగి మండలంలో పది వేల మంది మత్స్యకారులు ఉన్నారని, వారిలో ఏడు వేల మంది మత్స్య సంపదపై ఆధారపడి ఉన్నారన్నారు. మత్స్యకారుల పరిహారం రూ.20వేలకు పెంచాలని, బోట్లు, ఇంజన్లు, వలలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వ రాయితీలు పెంచాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ అవకాశం కల్పించాలని, సముద్రంలోకి వెళ్లిన వారికి జీపీఎస్ ట్రాకర్, ట్రాన్స్‌ఫౌండర్ కల్పించగలిగితే వారి భద్రతకు భరోసా ఉంటుందని విన్నవించారు.



అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 314 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందుతున్న అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి అర్జీలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, పింఛన్లు, బియ్యం కార్డులు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు వంటివి 314 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రత్నమణి పాల్గొన్నారు.

ఎస్పీకి 43 అర్జీలు

కాకినాడ క్రైం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లకు వచ్చే బాధితులకు వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 43 మంది అర్జీ దారులు సోమవారం ఎస్పీ విక్రాంత్‌పాటిల్ నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి న్యాయమైన సమస్యలపై విచారించి ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు.





సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్.. హాజరైన బ్యాంకర్లు

పెద్ద మొత్తంలో సొమ్ము బదిలీ ప్రయత్నం చేస్తే

ఖాతాదారుడికి సమాచారమివ్వాలి

సైబర్ నేరాల కట్టడికి ముందస్తు అప్రమత్తత ముఖ్యం

బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చాప కింద నీరులా నానాటికి విజృంభిస్తున్న సైబర్ నేరాలను కట్టడి చేసే ప్రక్రియలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న బ్యాంకర్లకు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సోమవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సెమినార్ హాల్లో నిర్వహించిన ఈ సమీక్షలో ఎస్పీ మాట్లాడుతూ సేవింగ్స్ ఖాతా నుంచి మరొక రాష్ట్రంలోని కరెంట్ అకౌంట్‌కు పెద్ద మొత్తంలో ట్రాన్స్‌ఫర్ చేయడానికి ప్రయత్నం జరుగుతుంటే, వెంటనే సంబంధిత బ్యాంక్ అధికారులు సదరు ఖాతాదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి నిర్ధారించుకోవాలన్నారు. ముఖ్యంగా అన్ని బ్యాంక్ బ్రాంచీల వద్ద సైబర్ నేరాల గురించి తెలియజేసే గోడ పత్రికలు నోటీస్ బోర్డ్‌లో ఉంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఖాతాదారుల నగదు ఆన్‌లైన్ లేదా సైబర్ క్రైమ్స్ ద్వారా అపహరణకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత బ్యాంకులపై ఉందన్నారు. డిజిటల్ అరెస్ట్ అనేది చట్టంలో లేదని, ఎవరైనా వాట్సాప్ ద్వారాగాని లేదా సోషల్ మీడియా ద్వారాగాని ఎవరైనా మోసం జరిగినట్టు చెబితే వెంటనే వారి సెల్‌ఫోన్ ఆఫ్ చేసి దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కిగాని, 1930 సైబర్ క్రైమ్స్ హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చన్నారు. తమ బ్యాంక్ ఖాతాదారులకు ఎప్పటికప్పుడు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం ద్వారా సైబర్ నేరాలను తగ్గిస్తామని, తద్వారా తమ బ్యాంక్ ఖాతాదారులకు రక్షణ కల్పించడం జరుగుతుందని పలు బ్యాంకుల మేనేజర్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కోస్టల్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, కెనరాబ్యాంక్, సిటీ యూనియన్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తదితర బ్యాంకుల అధికారులు హాజరయ్యారు. అలాగే కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్‌విష్ణు, ఎస్‌బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



తరగతిలో బోధన పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఇతర అధికారులు

సైన్స్‌పై పూర్తి అవగాహన కోసమే అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు : జిల్లా కలెక్టర్

తొండంగి, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు విద్యార్థుల్లో రోబోటిక్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌పై అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. సోమవారం బెండపూడి ఉన్నత పాఠశాలలో స్టార్టెచ్ ఇన్నోవేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పంచ్ పతాకా ఛాలెంజ్ ఎగ్జామ్‌ను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా చూపించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ షాన్ మోహన్ బోధకుల బోధనా విధానాన్ని, విద్యార్థుల అవగాహనా సామర్థ్యాన్ని, ప్రాక్టికల్‌లో విద్యార్థుల ప్రతిభను తరగతి గదిలో కూర్చుని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఎంతో ప్రయోజనకరమైనవన్నారు. పదో తరగతికి ముందు విద్యార్థులకు రోబోటిక్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌లపై అవగాహన కలిగిస్తారన్నారు. పది అనంతరం విద్యార్థులు వివిధ రకాల పరీక్షలకు హాజరుకావడం తిరిగి ఇంజినీరింగ్‌లోకి వచ్చేంతవరకూ దీనిపై అవగాహన లేకపోవడం వల్ల వారిలో భయం నెలకొంటోందన్నారు. ఇప్పుడు ఇచ్చే శిక్షణ ద్వారా విద్యార్థుల్లో ఉన్న భయంపోవడంతోపాటు అవగాహన పెంపొందించుకుంటారన్నారు. జిల్లాలో 49 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉండగా ఇప్పటి వరకూ ఉపాధ్యాయులే దీనికి సంబంధించిన బోధన చేశారన్నారు. వీరిలో వృత్తిపరమైన నాణ్యత అంతగా ఉండదన్న ఉద్దేశంతో వృత్తి నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. మొదటిగా పది పాఠశాలల్లో దీనిని అమలు చేసి మిగిలిన అన్ని పాఠశాలల్లో అమలుచేస్తామన్నారు. శిక్షణ సంతృప్తికరంగానే ఉందన్నారు. శిక్షణతోపాటు విద్యార్థులకు అవసరమైన కిట్లు కూడా అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్‌లకు సంబంధించిన విద్య అందించడం ప్రధాన ముందడుగన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో పిల్లి రమేష్, జిల్లా సైన్స్ అధికారి మైలపల్లి శ్రీనివాస వినీల్, స్టార్టెచ్ ఇన్నోవేషన్ ప్రతినిధులు అవనిగడ్డ రఘువంశీ, కారపల్లి దివ్యశ్రీ, డీవైఈవో ప్రభాకరశర్మ, ఎంఈవో షేక్ బాబ్జి, హెచ్ఎం నాగం కృష్ణమూర్తి ఉన్నారు.

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు..

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

- ఒక్కరోజే నాలుగు నామినేషన్ల దాఖలు
- మొత్తం నామినేషన్లు ఆరుకు చేరుకున్నాయి
- నేడు నామినేషన్ల పరిశీలన
- ఈనెల 21వతేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ
- వచ్చేనెల 5వతేదీన పోలింగ్
- వచ్చే నెల 9వ తేదీన కౌంటింగ్

- 6లో

సత్యదేవుని సన్నిధిలో భక్తుల రద్దీ

- రూ.75 లక్షల ఆదాయం

- 6లో



తొండంగిలో సద్యోజాత శివాలయం



శంకరా.. అర్ధనారీశ్వరా..

తొండంగిలో అరుదైన సద్యోజాత శివాలయం

తొండంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దర్శనం చేసుకుంటేనే తక్షణ ఫలితాన్ని అనుగ్రహించే అరుదైన సద్యోజాత శివాలయంగా పేరొందింది. రాజరాజేశ్వరి సహిత రామలింగేశ్వరుడి నిలయంగా కొలువైన ఈ ఆలయం కాకినాడ జిల్లా తొండంగి మండల కేంద్రంలో ఉంది. అన్ని శివాలయాలకంటే అత్యంత విశిష్టమైన శివాలయం పశ్చిమాభిముఖ శివాలయమని శైవాగమం పేర్కొంది. ఇటువంటి ఆలయాన్ని సందర్శిస్తే మరుక్షణం ఉత్తమ ఫలితాన్ని అందిస్తుందని, ఎక్కడైనా తారసపడితే తప్పక దర్శించి స్వామి అనుగ్రహం పొందాలని చెబుతోంది. తొండంగిలో ఉన్న రామలింగేశ్వరుడు పశ్చిమాభిముఖుడై సద్యోజాత ముఖంతో భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఈ ఆలయం అనేక విశిష్టతలకు నెలవై ఉంది. స్వామి లింగం అర్ధనారీశ్వర తత్వానికి ప్రతీకగా నిలిచింది. శివలింగం సగభాగం గౌర వర్ణంతో అమ్మవారికి ప్రతీకగా నిలుస్తోంది. ఆలయానికి పశ్చిమాన స్వామికి నిలయంగా చెప్పే రుద్రభూమి ఉంది. అమ్మవారు రాజరాజేశ్వరిగా కొలువై ఉన్నారు. ఉత్తరాన కోనేరు ఉంది. ఆలయ ప్రాంగణంలో సీతారాములు, చండీశ్వరుడు, వినాయకుడు, కాలభైరవుడు, అష్టలక్ష్ములు నవగ్రహాలు పరివార దేవతలుగా కొలువై ఉన్నారు.ఈ ఆలయాన్ని బ్రిటీష్ కాలంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసి



స్వామి అనుగ్రంతో పదోన్నతి పొందిన డబ్బీరు వెంకట రమణయ్యపంతులు జీర్ణోద్ధరణ చేసినట్టు చెబుతారు. తదనంతరం 2004లో గ్రామస్తులు మరోమారు ఆలయ జీర్ణోద్ధరణ జరిపారు. ప్రస్తుతం ఈ శివాలయాన్ని అన్నవరం ఆలయం దత్తత తీసుకుంది. అనేక విశిష్టతలుగల ఈ ఆలయానికి కార్తీక మాసంలో అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుంటారు. పౌర్ణమి రోజున స్వామి తెప్పోత్సవం ఘనంగా నిర్వహిస్తారు.



పౌర్ణమి రోజున తెప్పోత్సవం



బిక్కవోలులోని త్రిలింగక్షేత్రం

ఈ ఆలయానికి.. 1132 ఏళ్లు!



చరిత్రకు సాక్ష్యం ఏంటి.. తూర్పుచాళ్యులు అంటారు.. మొగలులు.. బాబర్ అంటారు.. ఇలా చరిత్రలో ఎంతో మంది రాజుల పేర్లు వినబడుతుంటాయి.. అయితే ఆనాటి రాజదర్పానికి నిదర్శనమైన కోటలు కనుమరుగయ్యాయి.. చరిత్రలో కలిసిపో యా యి.. అయితే వారు నిర్మించిన ఆలయాలు మాత్రం నేటికీ ఆ రాజుల దర్పానికి నిదర్శనంగా కనిపిస్తూనే ఉంటాయి. అటువంటి ఆలయాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నో ఉన్నాయి. వాటిలో ఒకటి.. నాడు తూర్పుచాళుక్యులు రాజ్యంలో ఉన్న త్రిలింగ క్షేత్రం బిక్కవోలు.. ఆ ఆలయం ఎప్పుడు నిర్మించారో తెలుసా..క్రీ.శ 849 - 892 సంవత్సరాల మధ్య... అంటే నేటికి 1132 సంవత్సరాలు అవుతోంది. అయినా నేటికీ చెక్కుచెదరలేదు.అపురూప శిల్పకళ భక్తులను అబ్బురపరుస్తోంది.. కార్తీక మాసంలో ఒక్కసారి ఆ ఆలయానికి వెళ్లాల్సిందే.. స్వామి దర్శనం చేసుకుని..ఆ ఆలయంలో సేదతీరాల్సిందే..

- చరిత్రకు సాక్ష్యం.. త్రిలింగ క్షేత్రం
- తూర్పు చాళుక్యుల నిర్మాణం
- ఆకట్టుకుంటున్న ఆలయ శిల్పకళ
- నాడు బిరుదాంకినవోలు..
- నేడు బిక్కవోలుగా ప్రసిద్ధి

బిక్కవోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మన దేశంలోని ప్రాచీన దేవాలయాలుగా గుర్తించిన వాటిలో ఆరు దేవాలయాలు తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామంలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. సుమారు 1100 ఏళ్ల కిందటే అనేక దేవతా మూర్తులు, పకృతి దృశ్యాలు మనోహరంగా మలచబడి దశాబ్దాలుగా ఎన్నో విపత్తులను, దాడులను తట్టుకుని ఇప్పటికే చెక్కు చెదరకుండా ఉన్నాయి. రాజమహేంద్రవరం-కాకినాడ పట్టణాల మధ్య పవిత్ర గోదావరి కాలువ చెంతనే ఉన్న బిక్కవోలు గ్రామాన్ని తూర్పుచాళుక్యులు క్రీ.శ 849 - 892 సంవత్సరాల మధ్య బిరుదాంకినవోలు పేరుతో రాజధానిగా చేసుకుని పరిపాలించారు. ఆ సమయంలోనే వారు పలు దేవాలయాలు నిర్మించారు. వాటిలోనివే బిక్కవోలులోని ఆరు దేవాలయాలు. గ్రామంలో ఉన్న ఈ ఆరు దేవాలయాల్లో ఐదు శివాలయాలే. వీటిలో గోలింగేశ్వర, రాజరాజేశ్వర, చంద్రశేఖర దేవాలయాలు గ్రామం మధ్యలో ఒకే ప్రాంగణంలో ఉండి భక్తుల పూజాధికాలతో నేటికి అలరారుతున్నాయి. గోలింగేశ్వరస్వామి గర్భగుడి లోపల ప్రధాన ద్వారబంధంపై ఉన్న తెలుగు అక్షరాల లిపి వెయ్యేళ్ల కాలం నాటిదని చరిత్రకారుల అభిప్రాయం. స్వామివారిని తదేకంగా చూస్తున్న నంది విగ్రహం కూడ ప్రాచీనమైనదే. ఇక్కడ ధ్వజస్తంభాన్ని ఆనుకుని ఉన్న కౌమారి విగ్రహం వద్ద భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తుంటారు.ప్రాచీన దేవాలయాలకే కాక ప్రతి యేటా ఎంతో వైభవంగా నిర్వహించే శ్రీకుమారసుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలతో బిక్కవోలు గ్రామం రాష్ట్ర ఖ్యాతి గడించింది.బిక్కవోలు ప్రాచీన దేవాలయాల విశిష్టతను మూడొందల పేజీలతో అరవై ఛాయా చిత్రాలతో సచిత్రంగా..దిటెంపుల్ ఆఫ్ బిక్కవోలు.. అనే గ్రంథం పేరుతో ఆంధ్రా విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ ఎస్.నాగేశ్వరరావు అందించారు. లక్షలాది ప్రాచీన కళాప్రియులకు నాగేశ్వరరావు అందించిన గ్రంథం గొప్ప వరమని చెప్పకతప్పదు.





కేదారేశ్వరస్వామి ఆలయం

గ్రామంలో జైన్ దేవాలయం

గ్రామంలో వేర్వేరు చోట్ల ఉన్న మరో మూడు దేవాలయాలు జీర్ణ దేవాలయాలుగా మారాయి. ఉన్నత పాఠశాల సమీప పంట పొలాల్లో ఉన్న దేవాలయాన్ని జైన దేవాలయంగా భావిస్తున్నారు. ఎటువంటి విగ్రహం లేకుండా పీఠం మాత్రమే ఉన్న ఈప్రాచీన గుడిని కంచరగుడి అని పిలుస్తారు. ఈ ఆలయ నిర్మాణం పూర్తిగా జైన సంప్రదాయ రీతిలో కొనసాగిందని చెప్పవచ్చు. రాష్ట్రకూటుల సాంస్కృతిక రాజధాని అయిన ఎల్లోరా గుహల్లో చివరిది జైన్ గుహలోని శిల్పకళారీతినే బిక్కవోలు దేవాలయం పోలి ఉంది. నలుపలకలుగా చెక్కిన రాళ్లను సున్నం వాడకుండా కేవలం గురుత్వాకర్షణ శక్తి, అనుపేక్షణీయతా సూత్రంతో ఒక రాయిపై రాయిని పేర్చి దేవాలయాలను నిర్మించారు. సుమారు వందేళ్ల కిందట ఈగుడి నుంచి తీసుకెళ్లిన వర్ధమాన మహావీరుడి ప్రతిమను చెన్నై మ్యూజియంలోని జైన గ్యాలరీలో ఉంచారు. 2006 సెప్టెంబరులో స్థానికుడొకరు ఈ ఆలయానికి దగ్గరల్లో గృహనిర్మాణం నిమిత్తం త్వకాలు జరుపుతుండగా ధ్యానముద్రలో వున్న మహావీరుడి శిల బయల్పడింది. ఇదే ఆలయ ద్వారబంధంపై ఉన్న లక్ష్మీదేవి శిలారూపం చెన్నై మ్యూజియంలోని గుణగవిజయాదిత్యుడి రాజముద్రపై వున్న లక్ష్మీదేవి రూపాన్ని పోలి ఉండడం గమనార్హం. ఈ ఆధారాలతోనే దేవాలయాన్ని జైన దేవాలయంగా భావిస్తున్నారు.



పొలాల మధ్య నేటికీ తెరుచుకోకుండా పాడుబడి ఉన్న జైన్ దేవాలయం

జువ్వలదొడ్డిలో నక్కల గుడి



నక్కల గుడి

బిక్కవోలు నుంచి ఊలపల్లి వెళ్లే మార్గంలో మరో ప్రాచీన వీరభద్రుడి ఆలయం ఉంది. ఇటీవల కేదారేశ్వరస్వామిగా కొలుస్తూ శివరాత్రి పర్వదినాన పూజాధికాలు గావిస్తున్నారు. ఈ ఆలయానికి దక్షిణం వైపు ఊలపల్లి రోడ్డు ఉండడంతో వీధిశూల తగలకుండా ఈ ఆలయంపై వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. తూర్పు చాళుక్యుల కాలంలో శిల్పకళకు, వాస్తుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నది ఇందుకు నిదర్శనం. జువ్వలదొడ్డిలో ఉన్న ప్రాచీన ఆలయాన్ని నక్కల గుడిగా పిలుస్తున్నారు. బిక్కవోలు నడిబొడ్డున ఉన్న గోలింగేశ్వర ఆలయంలో గోలింగేశ్వరస్వామితో పాటు సర్వాలంకార భూషితమైన పార్వతిదేవి, విఘ్నాలు తొలగించే వినాయకుడు, భద్రకాళి సమేత వీరభద్రుడు, సహజ పుట్టతో దర్శనమిచ్చే శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒకే ప్రాకారంలో ఉండి నిత్య పూజలందుకుంటూ నేటికీ భక్తులకు దర్శనమిస్తున్నారు.తూర్పు చాళుక్యుల సృజనాత్మకతకు ప్రతీకగా నిలుస్తూ ఉన్నత పాఠశాల దగ్గర కొలువై ఉన్న పదకొండు అడుగుల ఏకశిలా భారీ లక్ష్మీ గణపతి విగ్రహం భక్తుల పూజలతో అలరారుతూ ప్రసిద్ధపుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది.



రాజమహేంద్రవరం కోటిలింగాలఘాట్‌లో దేదీప్యమానంగా లక్ష దీపోత్సవం

కార్తీక దీపాల సంబరం

- రాజమహేంద్రవర కోటిలింగాల క్షేత్రంలో లక్ష దీపోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కోటిలింగాల క్షేత్రంలో లక్ష దీపోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. పవిత్ర కార్తీక మాసంలో సోమవారం సాయంత్రం లక్ష దీపోత్సవం దీప కాంతులతో వెలుగులీనింది. ఉమాకోటిలింగేశ్వర స్వామి దేవస్థానం, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 12వ లక్ష దీపోత్సవం వైభవోపేతంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు హాజరయ్యారు. ప్రత్యేకఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వీరరాఘవమ్మ, టీడీపీ ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, వైసీపీ నేతలు జక్కంపూడి విజయలక్ష్మి, భరత్, షర్మిలారెడ్డి పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతనతో కార్తీక దీపాలు వెలిగించి హారతులిచ్చారు. కోటిలింగాలరేవులో మెట్లపై ఏర్పాట్లు చేసిన మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి పూజలుచేశారు. కోటిలింగాలక్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. అతిథులకు కొండలరావు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ప్రధాన ఆలయాలు కార్తీక సోమవారం సందర్భంగా కళకళలాడాయి. కరప మండలం వాకాడలో దీపాల సంబరం ఆకట్టుకుంది.



రాజమహేంద్రవరంలో హారతి ఇచ్చి లక్ష దీపోత్సవం ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో తెల్లవారుజామున దీపాలు వదులుతున్న భక్తులు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు



సామర్లకోట భీమేశ్వరాలయంలో దీపాలతో శివలింగం



భక్తులతో రద్దీగా ఉన్న సామర్లకోట భీమేశ్వరాలయం



రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌వద్ద తెల్లవారుజామున భక్తుల పుణ్యస్నానాలు



కరప మండలం వాకాడ సంబరంలో వెలిగించిన కోటి దీపాలు



నామినేషన్లు అందజేస్తున్న నామన వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, అహమద్ షేక్

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు..

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

- చివరిరోజు4 నామినేషన్ల దాఖలు
- మొత్తం ఆరుకు చేరిన నామినేషన్లు
- నేడు పరిశీలన
- ఈనెల 21వరకు ఉపసంహరణలు
- వచ్చేనెల 5న పోలింగ్
- 9న కౌంటింగ్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీఎన్నికలకు సంబంధించి సోమవారం ఒక్క రోజే నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వీరు నలుగురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారు. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన నామన వెంకటలక్ష్మి, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కవల నాగేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన పులుగు దీపక్, మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన అహ్మద్‌షేక్ నామినేషన్లను సహాయ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా డీఆర్వో వెంకట్రావుకు అందజేశారు. ఈనెల 11వతేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా తొలుత బొర్రా గోపిమూర్తి, తర్వాత గంధం నారాయణరావు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో చివరిరోజైన సోమవారానికి నామినేషన్ల సంఖ్య ఆరుకు చేరుకుంది. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ల పరిశీలన క్రతువు జరుగుతుంది. ఈనెల 21వతేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ నిర్వహిస్తున్నారు. వచ్చేనెల 5న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. ఎన్నికల పోలింగ్‌కోసం ఆరుజిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12, తూర్పుగోదావరి జిల్లాలో 20, ఏలూరు జిల్లాలో 20, కాకినాడ జిల్లాలో 22, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22, పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా 16,316మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది ఓటర్లు, తూర్పుగోదావరి జిల్లాలో 2893, ఏలూరు జిల్లాలో 2605, కాకినాడ జిల్లాలో 3333, కోనసీమ జిల్లాలో 3209, పశ్చిమగోదావరి జిల్లాలో 3662 మంది ఓటర్లు ఉన్నారు. వచ్చేనెల 9న కౌంటింగ్ జరగనుంది. అదేరోజు ఎన్నికల ఫలితాలను వెల్లడించనున్నారు.

ప్రస్తుతానికి బరిలో ఆరుగురు

నామినేషన్లస్వీకరణ గడువు ముగియడంతో ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతానికి ఎన్నికల బరిలో ఆరుగురు అభ్యర్థులు ఉన్నారు. ఈనెల 21న ఉపసంహరణల తర్వాత బరిలో ఎవరు నిలుస్తారో లెక్క తేలనుంది.

సత్యదేవుని సన్నిధిలో భక్తుల రద్దీ

- రూ.75లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని రద్దీ నెలకొంది. అధికారులు వేకువజామున 2గంటలనుంచి వ్రతాలు, 3గంటలనుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఒక్కరోజు 9028 జంటలు స్వామివారి వ్రతాలు ఆచరించగా వివిధ విభాగాల ద్వారా రూ.75లక్షల ఆదాయం లభించింది. 70వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అధికారులు తీసుకున్న చర్యలతో ఆలయ ప్రాంగణంలో ఎంతమంది భక్తులు వస్తున్నా రద్దీ కనబడకపోవడం విశేషం.



వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

మూడు గంటలపాటు నరకయాతన

- ఆగిఉన్న లారీని ఢీకొన్న పాల వ్యాన్
- క్యాబిన్‌లో ఇరుక్కొన్న వ్యాన్ డ్రైవర్
- క్రేన్ సహాయంతో బయటకు..
- కాకినాడ జిల్లా తుని హైవేపై ఘటన


క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను స్టీరింగ్ తొలగించి బయటకు లాగుతున్న దృశ్యం

తుని రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో హైవేపై రాజుల కొత్తూరు సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఓ పాల వ్యాన్ డ్రైవర్ ఆగిఉన్న లారీని ఢీకొన్నాడు. లారీ వెనుకభాగంలో క్యాబిన్ ఉండిపోయింది. దీంతో డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. పెట్రోలింగ్ సిబ్బంది క్రేన్ సహాయంతో అతడ్ని మూడు గంటల తర్వాత బయటకు తీయగలిగారు. దీనికి సంబంధించిన వివరాలివి..

అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన ఎల్.శ్రీను పాలవ్యాన్ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అతడు విశాఖపట్నం నుంచి కత్తిపూడి వైపు పాల వ్యాన్‌తో వస్తున్నాడు. తుని హైవేపై రాజుల కొత్తూరు సమీపంలోకి వచ్చేసరికి నిద్ర మత్తులో ఆగిఉన్న లారీని వెనుకనుంచి బలంగా ఢీకొట్టాడు. ప్రమాద తీవ్రతతో వ్యాన్ నుజ్జునుజ్జు అవ్వగా డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా అటుగా వెళ్తున్న వాహనదారులుఅతడ్ని రక్షించేందుకు ప్రయత్నించినా బయటకి తీయలేకపోయారు. దీంతో పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్రేన్ సహాయంతో బయటకు తీశారు. మూడు గంటలపాటు మృత్యువుతో పోరాడిన శ్రీనును అంబులెన్స్‌లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తుని పోలీసులు కేసు నమోదు చేశారు.


అచ్చుగుద్దినట్టు.. అచ్చుగుద్దినట్టుగా పైన కింద.. ఒకేలా ఉన్న ఈ చిత్రం.. కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని తూరంగేశ్వరస్వామి ఆలయం కోనేరు వద్ద ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది.. -ఫొటోగ్రాఫర్, కాకినాడ

2 గంటల్లోనే ముంబయి పయనం

- రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ ఆక్యుపెన్సీ పెంపు
- డిసెంబరు 1 నుంచి ముంబయికి..
- 12 నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు
- 180 సీటింగ్‌తో విమానాల రాకపోకలు

రాజమహేంద్రవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం విమానాశ్రయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఇక్కడి నుంచే దేశవ్యాప్త రాకపోకలకు సన్నద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజమహేంద్రవరం విమానాశ్రయ అభివృద్ధికి రూ.250కోట్లు కేటాయించారు. దీంతో విమానాశ్రయ రూపురేఖలే మారిపోనున్నాయి. పనులు పూర్తయ్యేలోపు రాకపోకలను పెంచే యోచనలో ఉన్నారు. ఎక్కడికైనా ఇక్కడి నుంచి వెళ్లేలా విమానాశ్రయాన్ని సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకూ 72 సీట్లతో విమానాలు నడుస్తున్నాయి. ఇక డిసెంబరు 1 నుంచి 180 సీట్లు ఉన్న ఎయిర్‌బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. ఇప్పటికే టికెట్లు విక్రయిస్తున్నారు. 1వతేదీ నుంచి రాజమహేంద్రవరం టు ముంబయికి 180 సీట్లతో రోజుకు రెండు ఇండిగో ఎయిర్‌బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. అదే నెల 12వ తేదీనుంచి ఢిల్లీకి రెండు ఇండిగో ఎయిర్‌బస్సులు అటూ తిరుగుతాయి. 1వ తేదీ సాయంత్రం 4.50కి ముంబాయి నుంచి బయలుదేరి 6:45గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుంది. రాజమహేంద్రవరంలో రాత్రి 7.15గంటలకు ఎయిర్‌బస్సు బయలుదేరి రాత్రి 9.50 గంటలకు ముంబయి ఎయిర్‌పోర్టుకు చేరుతుంది. మొత్తం జర్నీ సమయం 2.10 గంటలు. మరో ఎయిర్‌బస్ డిసెంబరు 12న ఢిల్లీలో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి 9.45 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటుంది. రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టులో ఉదయం 10.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంటకు ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుతుంది. ఈ రెండు ఎయిర్ బస్సుల్లో 180మంది చొప్పున ప్రయాణికులు వెళ్లవచ్చు. ఇప్పటివరకూ రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు రోజూ అటూఇటూ 14 సర్వీసులు తిరుగుతున్నాయి. బెంగళూరుకు అటూ 4 సర్వీసులు ఉన్నాయి. చెన్నైకు ఒకసారి వెళ్లి వస్తోంది. గతంలో విశాఖనుంచి సర్వీసు ఉండేది. కానీ రోడ్డు మార్గాన 3గంటల్లో వచ్చేస్తుండడంతో ఎక్కువ మంది విమానం ఎక్కడానికి ఇష్టపడడంలేదు. దీంతో అది రద్దయింది. విమాన ప్రయాణికులు పెరిగితే అక్కడినుంచి కూడా మొదలవుతాయి. ఇక విజయవాడ, తిరుపతి ప్రయాణాలకు కొంత సమయం పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

24 గంటలు సర్వీసుకు అనుకూలం

-ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు

రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి రాత్రీ పగలూ మొత్తం 24 గంటలూ విమాన రాకపోకలు సాగించడానికి అనుకూలమైన సౌకర్యాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రయాణికుల ఆక్యుపెన్సీ బాగుంది. రోజుకు సగటున 1400 మంది రాకపోకలు సాగిస్తున్నారు. నైట్ ల్యాండింగ్ కూడా ఉంది. ప్రధానమంత్రి ప్రయాణించే బోయింగ్ 777 వంటి పెద్ద విమానాలు ఇక్కడినుంచి రాకపోకలు సాగించవచ్చు. ప్రస్తుతం ఉన్న టెర్మినల్‌ను మరో 4 రెట్లు విస్తరిస్తున్నారు.

'జయలక్ష్మి' బాధితులకు.. ఊరట!

- ఆర్థిక భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలకు శ్రీకారం
- పాత చైర్మన్, వైస్ చైర్మన్‌కు చెందిన 11 ఆస్తుల సీజ్‌కి ఉత్తర్వుల జారీ
- సేల్ ఆర్డర్ కోసం ఎదురుచూపులు



సర్పవరంజంక్షన్,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోట్లాది డిపాజిట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ పాత చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఆస్తుల సీజ్ చేసి బాధితులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. ఆర్థిక మోసానికి పాల్పడిన చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులుకు చెందిన ఎస్.అన్నవరంలో ఉన్న సర్వేనెంబర్ 101, వైస్‌చైర్మన్ విశాలాక్షి పేరుతో బెండపూడిలో సర్వే నెంబర్‌లో 113/4లో ఉన్న 11 ఆస్తులకు చెందిన 1968.83 చ.గజాల స్థలాలను సీజ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. వీరిద్దరి నిందితులతో పాటు డైరెక్టర్లు, రుణాలు తీసుకున్న వారికి చెందిన 84 ఆస్తులను సీఐడీ సీజ్ చేయడం, వీటిని ట్రిబ్యునల్ కోర్టులో వేయడంతో ప్రస్తుతం వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. జయలక్ష్మి ఆర్థిక మోసం వ్యవహారంలో నిందితులకు చెందిన 95 ఆస్తులను సీజ్ చేసినట్లు అయింది. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుకు చెందిన వ్యవహారంపై కదలిక రావడంతో రాబోయే నెలరోజుల్లో మరికొన్ని ఆస్తులను సీఐడీ ద్వారా సీజ్ చేయించే దిశగా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. సత్వరంగా ఆస్తుల సీజ్ ప్రక్రియ, కోర్టులో వాదోపవాదాలు జరిగి సేల్ ఆర్డర్ ప్రక్రియ జరిగితే బాధితులకు ప్రభుత్వం మేలు చేసినట్లు అవుతుందని బాధితులు పేర్కొంటున్నారు.

రూ.520కోట్లు స్వాహా

కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాల్లో 29 బ్రాంచీల ద్వారా 19వేలమందినుంచి రూ.520కోట్లు డిపాజిట్లు సేకరించారు. ఇందులో 2,245మంది సభ్యులకు రూ.455.78కోట్లు వరకు రుణాలు ఇచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, భార్య వైస్‌చైర్మన్ రాయవరపు విశాలాక్షి డిపాజిటర్లకు గడువు ముగిసినా అసలుతోపాటు వడ్డీ చెల్లించకపోవడంతో బాధితులు ఆందోళనకు గురై స్పందనలో 2022, ఏప్రిల్ నెలలో ఫిర్యాదు చేశారు. ఆందోళనకు గురైన డిపాజిటర్లు పలుచోట్ల వివిధ పోలీస్‌స్టేషన్లలో సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లపై ఫిర్యాదు చేయడంతో వీరిపై పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. జిల్లా సహకారశాఖ, సీబీసీఐడీ అధికారులు విచారణ పూర్తి చేసి రూ.582 కోట్ల మేర ఆర్థికమోసానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు 348 పేజీల నివేదికను ప్రభుత్వానికి అందించారు. ఈ ఆర్థిక కుంభకోణానికి ప్రధాన సూత్రదారులుగా జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామంజనేయులు, వైస్ చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్షి, కుమారుడు డైరెక్టర్ ఇతర డైరెక్టర్లు రాయవరపుజయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబహ్మణ్య కుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌లుగా నిర్ధారించారు. నివేదిక ఆధారంగా సీబీసీఐడీ చైర్మన్ సీతారామాంజనేయులు, వైస్ చైర్మన్ల విశాలాక్షి ఐదుగురు డైరెక్టర్లను అరెస్ట్ చేశారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

నిందితుల ఆస్తులపై కోర్టులో వాదనలు

ఆర్థిక కుంభకోణం కేసులో బాధ్యులైన సొసైటీ చైర్మన్, డైరెక్టర్లకు చెందిన ఏడాదిన్నర క్రితం 64 ఆస్తులు ఒకసారి, 20 ఆస్తులు మరోసారి సీఐడీ సీజ్ చేయడం, వీటిని ట్రిబ్యునల్ కోర్టులో వేశారు. ఈ ఆస్తుల వ్యవహారమై కోర్టులో ఆర్గుమెంట్లు కొనసాగుతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈనెల 14న చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులుకు చెందిన ఎస్.అన్నవరంలో సర్వే నెంబర్ 101, వైస్ చైర్మన్ విశాలాక్షి పేరుతో బెండపూడిలో సర్వే నెంబర్‌లో 113/4 లో ఉన్న 11 ఆస్తులకు చెందిన 1968.83 చ.గజాల స్థలాలను సీజ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటి ఈ కేసులో నిందితులకు చెందిన 95 ఆస్తులను సీజ్ చేసినట్లు అయింది. సీజ్ చేసిన ఆస్తుల విలువ రూ.250 నుంచి రూ.275 కోట్లు వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సెక్యూరిటీ వాళ్లు చెల్లించకపోతే..

స్థిరాస్తులను సెక్యూరిటీ పెట్టి రుణాలు తీసుకున్న వారు 10 నుంచి 15 రోజుల్లో రుణాలు చెల్లించాలని సొసైటీ పాలకవర్గ సభ్యులు నోటీసులు జారీ చేశారు. వీరి నుంచి రూ.125కోట్లు రికవరీ కోసం ట్రిబ్యునల్ కోర్టులో కేసు వేశారు. వీరు సత్వరంగా అసలు వడ్డీ కలిపి జమ చేసి రుణాలు క్లియర్ చేయాలని, లేదంటే 2022, మార్చి 31 తర్వాత నుంచి నేటి వరకు వడ్డీ వేసి కోర్టు ద్వారా రికవరీ చేస్తామని పాలవర్గం తెలిపింది.

ఆరు జీవోలు జారీ కావాలి

గంగిరెడ్డి త్రినాథరావు, చైర్మన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 11 ఆస్తులకు చెందిన ఒక జీవో జారీ చేశారు. మిగతా 6 జీవోలు జారీ కావాల్సి ఉంది. సీఐడీ వారు ఇంకా 50 మందిపై క్రిమినల్, సివిల్ కేసులు నమోదు చేయాలి. సత్వరంగా జీవోలు జారీ చేయడం పూర్తయితే ట్రిబ్యునల్ కోర్టులో ఆస్తుల వేలంపై సేల్ ఆర్డర్ జారీ చేసినట్లు జరిగితే బాధితులకు న్యాయం జరుగుతుంది.

నేడు సత్యదేవుడి హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ అన్నారు. విధులు కేటాయించిన సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు.

శివసదన్ కాటేజీకి అడ్వాన్స్ విరాళం

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన శివసదన్ కాటేజీకి హైదరాబాద్‌కు చెందిన లింగ శార్దక్ మంగళవారం అడ్వాన్స్ విరాళంగా రూ.2,01,101 ఆన్‌లైన్‌లో పంపినట్లు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తెలిపారు. ఈ కాటేజీ డోనార్ స్కీం ద్వారా రూ.10లక్షలు చెల్లించాల్సి ఉండగా మిగిలిన మొత్తం త్వరలో పంపుతానని సమాచారమిచ్చారన్నారు.

'అన్నవరం'లో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ సోమవారం ఈవో రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీచేశారు.ఈవో సీసీగా ఉన్న సీహెచ్ సాయిబాబాను సన్నిధి విభాగానికి మార్చి సూపరింటెండెంట్ కంచి మూర్తికి సీసీ బాధ్యతలు అప్పగించారు. పెన్నాడ వెంకటేశ్వరరావును సీఆర్వో విభాగంనుంచి పీఆర్వో విభాగానికి, వేలేటి జగన్నాథాన్ని సన్నిధి విభాగంనుంచి సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయానికి, ఎంవీ గణపతిరావును ఆలయ విభాగానికి కేటాయించారు.

జిల్లా మహిళా కబడ్డీ జట్టు క్రీడాకారులు వీరే

సామర్లకోట,నవంబరు18(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా మహిళల కబడ్డీ క్రీడాకారులు 16మందిని ఎంపిక చేసినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి, కోశాధికారులు కొండపల్లి శ్రీనువాస్, నిమ్మకాయల కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. వీరిలో 12మంది రైడర్లుగానూ, నలుగురు వెయిటర్లుగాను ఎంపిక చేశామన్నారు. ఎంపికైనవారిలో వెంకటలక్ష్మి, అపరంజిత, అరుణ, ఉమా, మంజుల, పరిమళ, వర్షిత, నాగమణి, అశ్రిక, రేఖ, దీపిక, పూనశ్రీ ప్రవల్లిక, జీవన జ్యోతి, నందిని, భవాని, శివజ్యోతి ఉన్నారు. త్వరలో జరిగే అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్‌లోపాల్గొంటారన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

- సత్తా చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
- బాలికల విభాగంలో ప్రథమస్థానం, బాలురలో ద్వితీయస్థానం


రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించిన తూర్పుగోదావరి బాలికల జట్టు

కాకినాడఅర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో జరుగుతున్న పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-19 హాకీ చాంపియన్‌షిప్ సోమవారంతో ముగిసింది. హోరాహోరీగా జరిగిన పోటీల్లో వివిధ జిల్లాలనుంచి 450మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు తమ సత్తా చాటారు. బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమస్థానం సాధించింది. బాలురవిభాగంలో ద్వితీయస్థానం సాధించారు. పోటీల్లో బాలికల్లో అనంతపురం ద్వితీయస్థానం, విశాఖ తృతీయస్థానం సాధించాయి. బాలుర విభాగంలో విశాఖ ప్రథమస్థానం సాధించగా ఉమ్మడి తూర్పు ద్వితీయస్థానం, అనంతపురం తృతీయస్థానం సాధించాయి.

విజేతలకు బహుమతి ప్రదానం

పోటీల్లో గెలిచిన విజేతలకు డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ అధ్యక్షతన బహుమతి ప్రదానం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, జేఎన్టీయూ క్రీడా కార్యదర్శి శ్యామ్‌కుమార్, హాకీ క్రీడాకారుడు దాసరి మురళీకృష్ణ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వివిధ జిల్లాల క్రీడాకారులను రాష్ట్రస్థాయి జట్లకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. కార్యక్రమంలో హాకీ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.రవిరాజు, పీఈటీ సంఘ జిల్లా కార్యదర్శి కె.నూకరాజు, ట్రెజరర్ రవి సుందర్‌కొర్, ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి జి.సునీల్ పాల్గొన్నారు.

తప్పుడు కేసు పెట్టి.. తప్పుడు ప్రచారం

- టీడీపీ నేత, మహాసేన రాజేష్
- నిజనిర్ధారణ చేయాలంటూ కోనసీమ ఎస్పీకి వినతి

అమలాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో 30కి పైగా తప్పుడు కేసులు పెట్టించి వేధింపులకు గురిచేశారని మహాసేన రాజేష్ ఆరోపించారు. తనకు కోర్టులపై పూర్తి నమ్మకం ఉందన్నారు. ఇప్పటికే జగన్ ప్రభుత్వంలో పెట్టిన 15కు పైగా కేసులను కోర్టులు కొట్టి వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవలకాలంలో జిల్లానుంచి ఓమహిళ తప్పుడు ఫిర్యాదు చేసిందని దానిపై నిజనిర్ధారణ చేయాలని కోరేందుకు సోమవారం కోనసీమ జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఎస్పీ బి.కృష్ణారావును కలిసి వివరించినట్టు ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా జనవరిలో ఏదో జరిగిందని వైసీపీ సానుభూతిపరురాలు నవంబరులో ఫిర్యాదు చేయడంలో మర్మమేమిటో తెలసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే కేసు పెట్టుకునే అవకాశం ఉన్నా ఎందుకు పెట్టలేదో ఆలోచించాలన్నారు. మహిళ ఫిర్యాదు చేయగానే కొన్నిచానళ్లలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్‌పై కేసునమోదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తనను, తన పార్టీని బద్నామ్ చేసేందుకు ప్రత్నిస్తున్నారని దుయ్యబట్టారు. మహిళ ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి నిజనిజాలు వెలికి తీయాలని కోరినట్టు ఆయన తెలిపారు.


అమలాపురం ఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న మహాసేన రాజేష్

ప్రాణం తీసిన ఈత సరదా

- కాలువలో స్నానానికి వెళ్లి విద్యార్థి మృతి


పాముల గౌతమ్(ఫైల్)

దేవరపల్లి,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి కాలువలో స్నానానికి వెళ్లిన విద్యార్థి నీట మునిగి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. దేవరపల్లి గ్రామానికి చెందిన పాముల వెంకట్రావు, శిరీష దంప తులకు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు పాముల గౌతమ్(14) స్థానిక ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో స్నేహితులు పోలుమాటి బాలారిషి, మద్దాల దుర్గాప్రసాద్, కనికెళ్ల సిద్దార్థ, కోనాల భరత్, కనికెళ్ల నందులతో కలిసి సాయంత్రం 3గంటలకు దేవరపల్లి జిల్లా పరిషత్ రహదారిలోని పోలవరం కుడి కాలువలో స్నానానికి వెళ్లాడు. గౌతమ్, దుర్గాప్రసాద్ స్నానానికి దిగగా మిగిలిన వారు గట్టుపై ఉన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాళ్లు అందక గౌతమ్ నీట మునిగిపోయాడు. దుర్గాప్రసాద్‌ను గట్టుపై ఉన్న స్నేహితులు ప్యాంటు, షర్టు ముడివేసి పైకి లాగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. స్నేహితులు ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయి ఈ విషయాన్ని తల్లిదండ్రులు ఎవరికీ చెప్పలేదు. సాయంత్రమైనా గౌతమ్ ఇంటికి రాకపోవడంతో ఆరా తీయగా స్నేహితులు కలిసి కాలువ స్నానానికి వెళ్లారని స్థానికులు చెప్పారు. దీంతో ఆ వీధిలో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా గౌతమ్ స్నేహితులతో వెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మిగిలిన స్నేహితులు జరిగిన సంఘటనను వివరించారు. సోమవారం ఉదయం ఘటన ప్రాంతానికి బంధువులు, పోలీసులు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. మునిగిన ప్రాంతం నుంచి 200మీటర్లు దూరంలో రెల్లిగడ్డి దుబ్బిలో మృతదేహం లభించినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.


పోలవరం కాల్వలో తేలియాడుతున్న మృతదేహం

పొలానికి నీరు పెడుతుండగా విద్యుదాఘాతం

- ముగ్గుళ్లలో వ్యక్తి మృతి

సీతానగరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం ముగ్గుళ్ల గ్రామానికి చెందిన మిరప శ్రీను(56) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సోమవారం ఉదయం అతడు తన పొలానికి నీరు పెట్టుకోవడానికి వెళ్లాడు. పక్కరైతు సరిహద్దుపొలం నుంచి బోదె ద్వారా నీరు ఇతడి పొలంలోకి రావాలి. బోదెద్వారా వచ్చే నీటిని గమనిస్తుండగా విద్యుత్ స్థలం నుంచి 11కేవీవైరు తెగి నీటిలో పడగా శ్రీను షాక్‌కు గురైమృతిచెందాడు. పక్క రైతు మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లగా రెండు కాళ్లు కాలిపోయి విగతజీవిగా ఉన్న శ్రీను కనిపించడంతో మృతుడి కుమారుడు రామారావుకు తెలిపాడు. ఎస్ఐ రామ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏసీబీ వలలో రంగంపేట సర్వేయర్

- రూ.75 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

రంగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏసీబి వలలో రంగంపేట మండల సర్వేయర్ చిక్కాల ధర్మారావు చిక్కాడు. రంగంపేట మండలం ఈలకొలను గ్రామానికి చెందిన బత్తిన రాముడు తన తల్లి బత్తిన సత్యవతి పేరున ఉన్న పొలం వివరాలు తప్పుగా పడ్డాయి. దాన్ని సరి చేయాలని సర్వేయర్ ధర్మారావును కోరగా రూ.75వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇచ్చేందుకు రాముడు ఒప్పందం కుదుర్చుకొని తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి ధర్మారావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ భాస్కరరావు, డి.వాసుకృష్ణ, వై.సతీష్ పాల్గొన్నారు.


అధికారులకు చిక్కిన సర్వేయర్ చిక్కాల ధర్మారావు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా హర్షవర్ధన్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా కె.హర్షవర్ధన్‌ను నియమిం చారు. సోమవారం ఆయన కాకినాడలో కలెక్టర్ షాన్ మోహన్, డీఆర్వో వెంకటరావును కలిశారు.


కాకినాడలో కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిసిన హర్షవర్ధన్

ఇనుప కడ్డీల మాటున గంజాయి రవాణా

కొవ్వూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 287 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోల్‌గేటు వద్ద సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాలీ లారీలో ఇనుప కడ్డీలు మాటున యర్రవరం టోల్‌గేట్ వద్ద లోడ్ చేసుకుని మహారాష్ట్రలోని అహ్మదాబాద్‌కు తరలిస్తున్న 287 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎస్ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయిస్ డీటీ సునీత, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ

23న కార్తీక వన సమారాధన

కాకినాడ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న స్థానిక గొడారిగుంటలోని శ్రీరమాసహిత సత్యదేవ మందిరంలో కార్తీక వన సమారాధన ఏర్పాటు చేసినట్టు మధ్వ పురోహితుడు యాదగిరి మధ్వేష్ తెలిపారు. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు అనంతరం హోమం నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

మాధవపట్నంలో వీధి కుక్కలపై విషప్రయోగం!

పది కుక్కలు మృతి

సామర్లకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామం అంబేడ్కర్ విగ్రహం సెంటర్ నుంచి రెండవ సచివాలయం వెళ్లే రోడ్డు కాలనీ ప్రాంతంలో గత 2రోజులుగా వీధి కుక్కలపై విషప్రయోగం కారణంగా వరుసగా కుక్కలు మృత్యువాత పడ్డాయని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభావం తమ ఇళ్లల్లో పెంచుకునే మేలు జాతి కుక్కలపై పడే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు. మృత్యువాత పట్టిన వీధి కుక్కలలో కొన్ని కుక్కలు గర్భం దాల్చిఉన్నట్లు తెలిపారు. పంచాయతీ అధికారులు సత్వరం స్పందించి వీధి కుక్కలపై విషప్రయోగం చేయకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. కాగా అదే ప్రాంతంలో మేకల శిబిరాలు నిర్వహిస్తున్నారని, వీధి కుక్కల బారి నుంచి మేకలను కాపాడుకునేందుకు మేకల పెంపకందారులే వీధి కుక్కలపై విషప్రయోగం చేశారన్న ఆరోపణలు కాలనీ వాసుల నుంచి వినవస్తున్నాయి. ఇదే విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను వివరణ కోరగా సోమవారం సాయంత్రం నాటికి వీధి కుక్కలపై విషప్రయోగం సంఘటనకు చెంది ఎవరూ పంచాయతీకి ఫిర్యాదులు చేయలేదని, పంచాయతీ చెంతనే పశువుల ఆసుపత్రి సిబ్బంది నుంచి ఏ సమాచారం పంచాయతీకి అందలేదని చెప్పారు. మంగళవారం సచివాలయ సిబ్బందిచే విచారణ చేయిస్తామని తెలిపారు.

యాంటీబయాటిక్స్‌పై అవగాహన

జీజీహెచ్ (కాకినాడ) నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల యాంటీబయాటిక్స్ ఔషధాలు, వాటి ప్రయోజనాలు, వాటిని వాడే విధానం, వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలోని మైక్రోబయాలజీ విభాగ సెమినార్ హాల్లో సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈనెల 24 వరకు యాంటీమైక్రోబియల్ అవేర్నస్ సదస్సులు జరుగుతున్నాయి. సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి హాజరయ్యారు. మైక్రోబయాలజీ హెచ్‌వోడి డా.పివి ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సూపరింటెండెంట్ మాట్లాడుతూ యాంటీబయాటిక్స్ వాడేటప్పుడు కచ్చితంగా వైద్యుడి సలహా పాటించి మాత్రమే ఔషధం వేసుకోవాలని, లేదంటే అనేక అనర్థాలకు దారి తీస్తాయన్నారు. యాంటీబయాటిక్స్ మందులు ఏవి తీసుకున్న కోర్స్‌గా వాడాలన్నారు. టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ అలాగే వైద్యవిద్యార్థులకు ఈనెల 24 వరకు ఈ సెమినార్ ద్వారా అవగాహనా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 33 మందికి కాకినాడ మూడవ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజేస్ట్రేట్ వి. నరసింహారావు జైలు, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెపారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు, ఎస్ రమేష్ డి.రామారావు తమ బృందాలతో ఆదివారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షీంచగా 33 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా 13 మందికి ఒక్కోక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 20 మందికి ఒక్కోక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలి

పెద్దాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ ఆయాల వేతన బకాయిలను చెల్లించాలని కోరుతూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆయాల సంఘం (సీఐటీయూ) సోమవారం ధర్నా నిర్వహించారు. సంఘం కార్యదర్శి బల్ల నాగమణి మట్లాడుతూ నాలుగు నెలలుగా తమకు వేతనాలు రావడం లేదని తక్షణమే వేతనాలు చెల్లించాలని ఆర్డీవో శ్రీరమణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీ, అన్నపూర్ణ, ఫాతిమ తదితరులున్నారు.

ఇండస్ట్రీస్ స్పోర్ట్స్ మీట్

సామర్లకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డు వెంబడి ఉన్న ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఏరియా పరిధిలోని పరిశ్రమలు సంయుక్తంగా ఇండస్ట్రీస్ స్పోర్ట్స్ మీట్ పోటీలు సోమవారం సామర్లకోటలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పరిశ్రమల మధ్య సత్సంభందాలు నెలకొల్పేందుకు, ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఇటువంటి స్పోర్ట్స్‌మీట్‌లు ఎంతగానో దోహదపడతాయని రాక్ సిరామిక్స్ ప్రతినిధులు టీ.నీరజ్‌కుమార్, డాక్టర్ వివి.శేషగిరిరావు తెలిపారు. ఈ నెల 23 వరకూ క్రికెట్, వాలీబాల్, చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు ప్రముఖుల చేతులమీదుగా బహుమతులు అందజేమన్నారు. వివిధ పరిశ్రమల ప్రతినిధులు వినోద్, చెల్లదురై, పి.బాలాజీ, వీజీఎస్.కుమార్, రవీంద్రనాథ్, అనిల్, ఆర్.శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, రవి, సురేష్, ఎస్‌రావు, గోపీచంద్, గాంధీ ఉన్నారు.

'జీజీహెచ్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి'

కాకినాడ క్రైం నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న కింది స్థాయి దివ్యాంగ ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్న పరిపాలనా విభాగ మేనేజర్ వై.నరసింగరావుపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కండవిల్లి భరత్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నరసింగరావుపై లోతైన విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శివోహం...

పాదగయకు పోటెత్తిన భక్తులు

కుక్కుటేశునికి విశేష పూజలు, అభిషేకాలు





గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో విశేష అలంకారంలో ఉమారామలింగేశ్వరస్వామి, పిఠాపురం పాదగయ పుష్కరిణి వద్ద భక్తుల రద్దీ దృశ్యాలు

పిఠాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురంలోని పాదగయ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. రహదారులు జన సంద్రమయ్యాయి. కార్తీకమాసం మూడో సోమవారం పాదగయ క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. పాదగయ పుష్కరిణిలో తెల్లవారుజాము 3 గంటలు నుంచే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని తులసి చెట్టు వద్ద పూజలు జరిపారు. పుష్కరిణి వద్ద, ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. కార్తీక దీపాలను అరటిడొప్పల్లో వెలిగించి పుష్కరిణిలో వదిలారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రదిక్షిణలు చేసే భక్తులతో భక్తజనసంద్రమైంది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. కుక్కుటేశ్వరస్వామికి 21 రకాల ద్రవ్యాలతో మహాన్యాసపూర్వ ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అభిషికేతుడైన స్వామిని భక్తులు దర్శించుకున్నారు. కార్తీక సోమవారం నోము ఆచరించే భక్తులు ఉపవాసం ఉండి సాయంత్రం ఆలయంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావుల ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

భీమేశ్వరాలయంలో...

సామర్లకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4గంటలకు గోపూజలు నిర్వహించి పూజలను ప్రారంభించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేక, పుష్పార్చన పూజలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి,అమ్మవార్లను దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో మధ్యాహ్నం జరిగిన లక్షపత్రి పూజల్లో కాకినాడకు చెందిన దేవరకొండ సత్యనారాయణమూర్తి దంపతులు ఆశీనులయ్యారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. ఆకాశదీప , జ్యోతిర్లింగార్చన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమవారం రాత్రి ఆలయానికి విచ్చేసిన భక్తులకు సామర్లకోట లయన్స్ భీమేశ్వరా క్లబ్ సౌజన్యంతో చక్కెర పొంగలి, పులిహోర అల్పాహారం, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేసారు. సుమారు 3వేలమంది భక్తులకు అల్పాహారం అందజేశారు. దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ సుబ్బారావు భీమేశ్వరాలయంలో కార్తీక మాస ఏర్పాట్లు నిర్వహణకు చెంది తనిఖీలు నిర్వహించారు. ఆర్‌జేసీ వెంట సామర్లకోట ఆలయ ఈవో నీలకంఠం, అర్చకులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో...

గొల్లప్రోలు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామి, చేబ్రోలులో పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామి, దుర్గాడలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. దుర్గాడ శివాలయానికి భక్తులు పోటెత్తారు. రామలింగేశ్వరస్వామి, లలితా, ఉమాదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు. తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

వాకాడలో దీపాల సంబరం

కరప, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కరపమండలం వాకాడ గ్రామంలో సోమవారం రాత్రి కోటి దీపాల సంబరం ఘనంగా జరిగింది. రామాలయం ఆవరణలో కర్రలు, చెక్కలతో రెండు భారీ టవర్ ఆకృతులను నిర్మించారు. వాటి మధ్య అరలలో మట్టి ప్రమిదలను ఉంచి ఆ ప్రమిదల్లో నూనె పోసి తెల్లవార్లు కోటి దీపాలను వెలిగించారు. సంబరానికి విచ్చేసిన మహిళలు ఈ ప్రమిదల్లో ఒత్తులను భక్తితో వెలిగించి పూజాదికాలు నిర్వహించారు. నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశార. రాత్రి తెల్లవార్లు జరిగిన ఈ సంబరాన్ని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాదిమంది వీక్షించారు. సంబరంలో ఏ అవాంఛనీయ సంఘటన జరగకుండా కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. కాకినాడరూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్తిబాబు, జనసేన, వైసీపీ నాయకులు, గ్రామపెద్దలు కార్తీక దామోదరుడిని దర్శించుకున్నాను.

కాకినాడ ఎంపీకి ఘన స్వాగతం



ర్యాలీగా వస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, కుడా చైర్మన్ తుమ్మల బాబు

కలెక్టరేట్(కాకినాడ)/పెద్దాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అమెరికాలో న్యూయార్క్‌లో జరిగిన 79వ ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో పాల్గొని స్వదేశానికి చేరుకున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు ఘనంగా స్వాగతం లభించింది. సోమవారం స్వదేశానికి చేరుకున్న ఎంపీ ఉదయం హైదరాబాద్ నుంచి మధురపూడి విమానాశ్రయానికి చేరుకోగా జనసేన కార్య కర్తలు భారీ సంఖ్యలో చేరుకుని స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి భారీ కాన్వాయ్‌తో రోడ్డు మార్గంలో కాకినాడ క్యాంప్ కార్యా లయానికి చేరుకున్నారు. మార్గ మధ్యంలో పెద్దాపురం గుర్రాల సెంటర్లో కుడా చైర్మన్ తుమ్మల బాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన : వర్మ

గొల్లప్రోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు అన్నివర్గాల ప్రజలు నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. గొల్లప్రోలులో సభ్యత్వ నమోదును ఆయన సోమవారం పరిశీలించి ఇంటింటికి వెళ్లి పలువురు మహిళలను పార్టీలో సభ్యులుగా చేర్పించారు. రూ.100చెల్లించి సభ్యత్వం పొందితే రూ.5లక్షల బీమా సదుపాయం లభిస్తుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 65లక్షల మంది టీడీపీలో సభ్యులుగా చేరారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, కడారి బాబ్జి, బస్సా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు

పిఠాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. మూడు రోజులు పాటు శ్రీపుష్పయాగం నిర్వహించారు. మల్యాల హరగోపాలరావు కుటుంబసభ్యులు, కుంటముక్కల సాయిరంగ భాస్కర్, సత్యవాణి శ్రీ, సన్నిధి సత్యనారాయణ, భవానీ సత్యదేవి దంపతులు పాల్గొని పూజాది కార్యక్రమాలు జరిపించారు. మహిళలకు దంపత తాంబూలాలు అందజేశారు. యాగ్నిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు, ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ అభివృద్ధి సేవాసమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ శ్రీరామ్మోహన్, మల్యాల గోపాలకృష్ణ, అప్పలరాజు, బాబు, లక్ష్మీ, ప్రియాంక, మల్యాల సూర్యకల్యాణి, ఈవో సున్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

15 నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

సామర్లకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో 15 నీటి వినియోగదారుల సంఘాలకు జరుగనున్న ఎన్నికలకు సంబంధించి 104 ప్రాదేశిక సభ్యుల ఎన్నికలకు చెంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. వీకెరాయపురం, సామర్లకోట, ఉండూరు, మామిళ్ళదొడ్డి, జీ.మేడ పాడు, వేట్లపాలెం వెంకటపతిరాజు చెర్వు, సామర్లకోట పీబీసీ-1, తిమ్మాపురం పీబీసీ-2, పండూరు పీబీసీ-3, చిత్రాడ పీబీసీ-4, బిక్కవోలు, మల్లాం, గొల్లల మామిడాడ, పెద్దాడ, అత్యుతాపురత్రయం నీటి వినియోగదారులసంఘాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

పెన్షనర్లపై కేంద్రం వైఖరికి నిరసనగా ధర్నా

సర్పవరం జంక్షన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్-95 పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరికి నిరసన తెలుపుతూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ (ఏపీఆర్‌పీఏ) సభ్యులు సోమవారం కాకినాడ బోట్‌క్లబ్ ఆశ్రమం స్కూల్ సమీపంలో ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సత్తిరాజు, కె.రమణమూర్తి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే 3 వేలు కనీస పెన్షన్ అమలు చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చి మొండి చేయి చూరన్నారు. పదేళ్లు గడుస్తున్నా ఈపీఎస్ 95 పెన్షనర్ల పట్ల కేంద్రం అత్యంత కర్కశంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఈపీఎఫ్‌వో కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రామదాసుకి అందించారు. జిల్లా నాయకులు జోగా అప్పారావు, కర్రి బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, పీవీ రమణ, జార్జి బర్న్, బస్సు దేవిడ్‌మోహన్ మురళీ, మోకా రామకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కాకినాడ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర టీడీపీ నాయకుడు గుణ్ణం చంద్రమౌళి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం కాకినాడలో నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాం వర్మ, సభ్యులు తొలుత చంద్రమౌళిని గజమాలతో సత్కరించారు. అనంతరం ఫౌండేషన్ కార్యాలయం వద్ద పేదలకు 5 కిలోల రైస్ బ్యాగులు, దుప్పట్లు పంచి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు చెరుకూరి శేషగిరి వర్మ, మండపాక సాయిరాం, బత్తుల దుర్గాప్రసాద్, కర్రి వీరబాబు, అడపా జగదీష్, మండపాక నాగుబాబు ఉన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నాలు



ధర్నా చేస్తున్న ఏపీ బీసీ ఫెడరేషన్, ప్రజా సంఘాల ఐక్యవేదిక, అఖిలపక్ష పార్టీల ప్రతినిధులు, బాధితులు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎల్‌బీనగర్‌లో మృతిచెందిన కుక్కల చరణ్ శ్రీతేజ(12) అనే బాలుడు కేసును పోలీసులు నీరుగారుస్తున్నారని బీసీ సంఘాల నేతలు, బాధితులు సోమవారం కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. తమ ఇంటికి సమీపంలో రాజేశ్వరి రెసిడెన్సీ వద్ద ఈ ఘటన జరిగిందనీ, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ చెప్పిన వివరాలతో అనుమానస్పదంగా మృతి ఉందని బీసీ సంఘాల నేతలు ఆరోపించారు. తొలుత ఉసిరి చెట్టుపై నుంచి పడిపోయారడని, తర్వాత అపార్ట్‌మెంటుపై నుంచి అని, మళ్లీ విద్యుత్ షాక్ వల్ల అనీ చెప్పడంతో పలు అనుమానాలు వస్తున్నాయని, పలువురు రాజకీయనాయకులు కేసులను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. రీ పోస్టుమార్టం చేసి జ్యుడీషియల్ ఎంక్వరీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతి పత్రం ఇచ్చారు. ధర్నాలో ప్రజా సంఘాల ఐక్యవేదిక, ఏపీ బీసీ ఫెడరేషన్ కన్వీనర్ పప్పు దుర్గా రమేష్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్, రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణ, బహుజన సంఘాల ఐక్యవేదిక నాయకులు నారాయణగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గుత్తుల రమణ, మంగాదేవి, చొల్లంగి వీరబాబు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ధర్నా

ఆశా వర్కర్లకు కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు నర్ల ఈశ్వరి మాట్లాడుతూ ఆశా వర్కర్లు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ తదితరులు ఉన్నారు.

108 ఉద్యోగుల నిరాహారదీక్ష

జిల్లాలో పనిచేస్తున్న 108 అంబులెన్సు సర్వీస్‌లో ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని 108 కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఒకరోజు రిలే నిరాహారదీక్ష చేశారు. సంఘం అధ్యక్షుడు సత్య దుర్గా రమణ మాట్లాడుతూ ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు వెళతామని హెచ్చ రించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. రాజ్‌కుమార్, జయరామ్, సత్యనారాయణ, సుధాకర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలి

పాదగయలో దేవదాయశాఖ ఆర్‌జేసీ సుబ్బారావు తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న సుబ్బారావు

పిఠాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనరు సుబ్బారావు ఆదేశించారు. ఆయన సోమవారం పాదగయ క్షేత్రంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్యం నిర్వహణలో ఆలసత్వం వద్దని, ప్రతి అరగంటకు ఒక సారి ఆలయ పరిసరాలు పరిశుభ్రం చేయాలని సూచించారు. భక్తుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని చెప్పారు. మహిళా వలంటీర్లను అదనంగా ఉంచాలన్నారు. పాదగయ పుష్కరిణి పరిశుభ్రంగా ఉంచాలని, అందులో వేసే పూజా సామాగ్రి, అరటిడొప్పలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. బయోటాయిలెట్లును భక్తులకు కనబడేలా అందుబాటులో ఉంచాలని, ప్రస్తుతం ఏర్పాటు చేసిన స్థలం సరిగా లేదని చెప్పారు. అన్నప్రసాదాలు అందించే కౌంటర్లుతో పాటు బయోమెట్రిక్ కౌంటర్లు పెంచాలని, ఎక్కడ తోపులాటకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పాదగయలో ఇటీవల జరిగిన సంఘటనలపై దేవదాయశాఖ డిప్యూటీ కమిషనరు నిర్వహించిన విచారణ నివేదిక కమిషనరుకు పంపడం జరిగిందని, దాని ఆధారంగా కమిషనరు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఉన్నారు.

రైస్‌మిల్లర్ల సంక్షేమానికి అంకితభావంతో కృషి

అట్టహాసంగా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన పిఠాపురం, తుని ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పిఠాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్ల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొగలి అప్పారావు(నాని) సూచించారు. పిఠాపురం రైస్‌మిల్లర్స్ కల్యాణమండపంలో సోమవారం సాయంత్రం పిఠాపురం, తుని ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా గొల్లపల్లి తిరుపతిరావు(చినబాబీ), ఉపాధ్యక్షుడిగా గుండుబిల్లి పోలీసు(చిన్న), కార్యదర్శిగా శెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా మేడిపూడి రాజబాబు, జాయింట్ సెక్రటరీగా కీర్తి సూరిబాబు, గౌరవాధ్యక్షుడిగా రెడ్డి రాజా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారిని రైస్‌మిల్లర్లు అభినందించారు. సమావేశంలో నానితో పాటు కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పేకేటి నాగేశ్వరరావు, కొయ్యా మురళీ, కనిగిరి దివాణం, వెలుగుల బాబీ తదితరులు ఉన్నారు.

ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



పిఠాపురంలో వినతులు స్వీకరిస్తున్న జేసీ

పిఠాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టరు రాహుల్‌మీనా ఆదేశించారు. పిఠాపురం రథాలపేట సెంటర్‌లో గల అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికలో ఆయన ప్రజలు నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి సూచనలు ఇచ్చారు. ప్రతీ దరఖాస్తుకు వారికి సంతృప్తికరమూన రీతిలో సమాధానం ఇవ్వాలన్నారు. పరిష్కారంలో ఆలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల నుంచి పలు అంశాలపై 78 అర్జీలు అందాయి. కార్యక్రమంలో పిఠాపురం మున్సిపల్ కమిషనరు కనకారావు, తహసీల్దారు గోపాలకృష్ణ, మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

'సత్వరం చొరవ చూపాలి'

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ కమిషనర్ భావన ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి కమిషనర్ హాజరయ్యారు. సుమారు ఏడుగురు డయల్ యువర్ కమిషనర్ నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు వివరించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ ప్రజల నుంచి పలు సమస్యలపై 50 వరకు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, ఏడీహెచ్ సిరిల్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకటరాజు పాల్గొన్నారు.

'శెట్టిబలిజ వన సమారాధన విజయవంతం'

కాకినాడ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెక్లారిన్ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన శెట్టిబలిజ వన సమారాధన విజయవంతమైందని, ఇంత పెద్ద కార్యక్రమంలో జరిగిన చిన్న పాటి వివాదాన్ని పెద్దదిగా చేయడం సరికాదని కార్తీక వన సమారాధన కన్వీనర్ గుత్తుల శ్రీనివాస్, టీడీపీ జిల్లా నాయకుడు నులుకుర్తి వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రామారావుపేటలోని శెట్టిబలిజ భవనంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 40 ఏళ్లుగా కాకినాడ జిల్లా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది వన సమారాధనకు దాదాపు 20 వేల మంది సంఘీయులు తరలివచ్చారన్నారు. ఇంత పెద్ద కార్యక్రమంలో చిన్నపాటి అపశృతి చోటు చేసుకోవడం సహజమన్నారు. సంఘీయులందరూ ఐకమత్యంగా ఉన్నామని స్పష్టం చేశారన్నారు. సమావేశంలో సంఘం నాయకులు చొల్లంగి వీరబాబు, వాసంశెట్టి భీమరాజు, దొడ్డి వీరేంద్ర, పంపన బుజ్జి, అంజిబాబు పాల్గొన్నారు.

కవి సోమసుందర్ శతజయంతి వేడుకలు

పిఠాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజహితం కోరే యువకుల్లో ఉద్యమస్ఫూర్తి నింపే రచనలను సోమసుందర్ ఎన్నో చేశారని, ఆ ఖ్యాతి ఆయన సొంతమని పలువురు వక్తలు అన్నారు. ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఆవంత్స సోమసుందర్ శతజయంతి వేడుకలను సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. సోమసుందర్ విగ్రహానికి మండలి సభ్యులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహృదయ మిత్రమండలి అధ్యక్షులు తోట శ్రీనివాస్, గట్టి శ్రీకృష్ణదేవరాయ, కవి మేకా మన్మథరావు, మిత్రమండలి ప్రధాన కార్యదర్శి సతీష్, భాష్యం ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు తదితరులు ఉన్నారు.



సోమసుందర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన దృశ్యం

చెత్త తరలింపు కేంద్రం ప్రతిపాదన విరమించుకోవాలి

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

కొత్తపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాకతిప్ప ఎండీపేట సమీపంలో చెత్త తరలింపు కేంద్రం ప్రతిపాదన విరమించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో నవంబరు 8నుంచి 18 వరకు ప్రజాసమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీపిలుపు మేరకు నిర్వహించిన ప్రజాపోరు కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ వాకతిప్ప మాదిగ పేట ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో చెత్త డంపింగ్ యార్డ్ నిర్వాహణకు అధికారులు చేసిన ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో పలు గ్రామాల్లో ప్రజలు, దళిత కాలనీలకు తాగునీరందించాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు కేవీవీ సత్యనారాయణ, జీవీఎస్‌రెడ్డి, సోమరాజు, గంగాధర్, ఏ సుబ్రహ్మణ్యం, వాసు, వెంకటలక్ష్మి, సునీత, విజయ్, వి.సత్యనారాయణ, చంద్రబాబు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి విజయం కోరుతూ పూజలు

పిఠాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో జరిగే ఎన్నికల్లో ఎన్‌డీఏ మహాయుతి కూటమి విజయం సాధించాలని కోరుకుంటూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో సోమవారం పూజలు నిర్వహించారు. అర్బన్ బ్యాంకు కార్యాలయం నుంచి మహాసంస్థానం వరకూ జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు, బీజేపీ నాయకులు ప్రదర్శన జరిపారు. ఆలయంలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులున్నారు.

కష్టాలు తెలుసుకున్నా : పవన్

మహారాష్ట్రలో ఎన్‌డీఏ కూటమి తరపున ఎన్నికల ప్రచారం సందర్భంగా అక్కడి భక్తులు పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి వచ్చేందుకు పడుతున్న ఇబ్బందులు, కష్టాలు తెలుసుకున్నానని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. మహారాష్ట్ర, ఉత్తరాది రాష్ట్రాల మీదుగా వచ్చే రైళ్లన్నింటికి పిఠాపురంలో హాల్ట్ కల్పించే విధంగా రైల్వేశాఖ దృష్టికి తీసుకువెళ్లతానని చెప్పారు. లాతూర్ నుంచి తిరుపతికి విమానసర్వీసులు నడిపేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతీ కూటమి విజయం సాధించాలని కోరుకుంటూ పిఠాపురంలో జనసేన, బీజేపీ శ్రేణులు పూజలు నిర్వహించారని ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు.



పిఠాపురంలో పూజలు చేస్తున్న జనసేన నాయకులు

రేపు 'డయల్ యువర్ డీఎం'

ఏలేశ్వరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ డిపో కార్యక్రమం ఈనెల 20న నిర్వహిస్తున్నట్టు ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ జి.వి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు తెలిపేందుకు 9959225532లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంప్రదించాలని కోరారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వివిధ ఇంజనీరింగ్ విభాగాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో పంచాయతీరాజ్, గృహ నిర్మాణం, విద్యుత్, రోడ్లు, భవనాలు, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల అధికారులతో సమీక్షించారు. ఏడు మండలాల్లో విద్యుత్ మీటర్లు లేని ఇళ్లను గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా గృహాలకు రాయితీపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, డీఈఈలు చైతన్య, గౌతమి, శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, దివాకర్, సాయిసతీష్, శివ, ఏఈలు సత్యనారాయణ, నాగరాజు, దొరబాబు, పి.వెంకటరమణ, వంశీకృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

రంపచోడవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో 17,320 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. తన కార్యాలయంలో పశుసంవర్ధక, ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గిరిజన రైతులు దళారుల వద్ద మోసపోకుండా అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో పంటలకు కోతుల బెడద ఉందని, ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఉద్యానవన శాఖాధికారి కె.చిట్టిబాబు, ఏఎస్‌వో విజయ భాస్కర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు కె.సావిత్రి, చౌదరి ఉన్నారు.

అర్హులందరికీ నష్టపరిహారం : సబ్ కలెక్టర్



ప్రజా సమస్యలు వింటున్న సబ్ కలెక్టర్

రాజవొమ్మంగి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో భవనాలు, స్థలాలు కోల్పోయిన అర్హులందరికీ నష్టపరిహారం తప్పక అందుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. సోమవారం ఆమె తహసీల్దారు కార్యాలయంలో జాతీయ రహదారి నిర్మాణ సంబంధిత సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గతంలో నష్టపోయిన వారిని గుర్తించే సమయంలో నమోదు చేయని వారి కోసం మరలా సర్వే చేసి నమోదు చేస్తున్నామన్నారు. తహసీల్దారు అల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన ఉండాలి'



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మ ఫర్హీన్

చింతూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సీఐడీ అడిషనల్ ఎస్పీ అస్మ ఫర్హీన్ పేర్కొన్నారు. సోమవారం చింతూరు ఐటీడీఏ సమావేశ మందిరంలో రాజమహేంద్రవరం సీఐడీ విభాగ ప్రాంతీయ కార్యాలయం నేతృత్వంలో చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, ఎస్సీ, ఎస్టీ కమీషన్ రాష్ట్ర సభ్యుడు చిచ్చడి మురళి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, డిప్యూటీ తహసీల్దారు విఘ్నేష్, ఆదివాసీ నాయకుడు చిన్న వీరభద్రం, సర్పంచ్ కారం కన్నారావు, రంపచోడవరం ఏపీపీ రవీంద్రబాబు, ఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

'నాటి ఒప్పందాలపై జీవోలను ప్రవేశపెట్టాలి'



చింతూరులో ర్యాలీ చేస్తున్న ఆశా వర్కర్లు

చింతూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాటి ఒప్పందాలపై జీవోలను తక్షణం ప్రవేశపెట్టాలన్న ప్రధాన డిమాండుతో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రవ్వ వీరమ్మ నేతృత్వంలో చింతూరులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ కార్యాలయంలో అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కారం సుబ్బారావు, ఆశా నాయకురాళ్లు ముత్తమ్మ, నూతన, సుజాత, శ్రీదేవి, ఝాన్సీ, నర్సమ్మ, భద్రమ్మ పాల్గొన్నారు.

గిరిజనేతరులకు ఇళ్లు మంజూరు చేయాలి

ఎటపాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజనేతరులకు కూడా పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఎలిశాల నాగరాజు, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ ముబీన్, గుండమళ్ల రమేష్ బాబు, గడ్డం వెంకటేష్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

విద్యార్థులకు అవగాహన

వై.రామవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలోని పుస్తకాలను అభ్యసించడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వై.రామవరం శాఖా గ్రంథాలయ అధికారిణి జర్తా సత్యవతి తెలిపారు. సోమవారం జూనియర్ కళాశాల విద్యార్థులకు పలు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఈశ్వరకృప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్

చింతూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మావోయిస్టు ప్రభావిత గ్రామమైన లంకపల్లిని చింతూరు సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రమేష్ సందర్శించారు. వృద్ధులకు దుప్పట్లు, చిన్నారులకు అల్పాహారం, యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు.కానిస్టేబుల్ చంద్రరావు పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

ప్రత్యేక పూజలు, అభిషేకాలు

పలుచోట్ల అన్నదానాలు







రౌతులపూడి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు, ఏలేశ్వరం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు, తునిలో దీపాలు వెలగిస్తున్న భక్తులు

ఏలేశ్వరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లో శైవ క్షేత్రాలతో పాటు పట్టణంలో ఏలేరు నదీతీరాన వేంచేసిన శ్రీరాజరాజేశ్వరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు కోడూరి మహేష్, శేఖర్, వెంకటేష్ అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపించారు. మహిళలు పాల్గొన్నారు.

రౌతులపూడి: రౌతులపూడి, శృంగవరంలో గల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున 3 గంటలకే ఆలయాలకు భక్తులు చేరుకుని ధ్వజస్తంభాల వద్ద దీపారాధనలు చేశారు. మహాదేవుడికి అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శృంగవరంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

తుని రూరల్: వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు తేటగుంట శ్రీఉమామహేశ్వర స్వామిఆలయం, పత్రాళ్ళ కొండ వద్ద తాండవ లింగేశ్వర ఆలయం, తిమ్మాపురంలో ఉమా రామలింగేశ్వర ఆలయంలో పెద్దఎత్తున పూజలు ఆచరించారు. తేటగుంట శివాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ పేరూరు గాంధీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు.

ప్రత్తిపాడు: లంపకలోవ, ఎకరకంపాలెం, ధారపల్లి, ధర్మవరంలో వన సమారాధనలు, రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో లక్ష పుష్ప లక్ష తులసిపూజలు జరిగాయి. ధర్మవరం కోల్డ్ స్టోరేజ్ సమీప ప్రదేశంలో అయ్య ప్పస్వాముల ఆధ్వర్యంలో 10వేలమందికి, ఒమ్మంగిలో శివ కేశవ సాయి సత్సంగం ఆధ్వర్యంలో 6వేల మంది భక్తులకు కార్తీక వన సమారాధనలు జరిగాయి.

టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో నెహ్రూ



టీటీడీ ధర్మకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం అన్నమయ్య భవన్‌లో నిర్వహించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, పాలకమండలి సభ్యులు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, పలువురు పాల్గొన్నారు. అనంతరం టీటీడీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

'రామ్మూర్తి నాయుడు మృతి టీడీపీకి తీరని లోటు'

ప్రత్తిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటని పలువురు ప్రత్తిపాడు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద సోమవారం రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కొమ్ముల కన్నబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బద్దిరామారావు, ఉల్లి వీరభద్రరావు, దాట్ల అప్పన్నబాబు, అమరాద వెంకట్రావు, పైలా సాంబశివరావు, మూది నారాయణ స్వామి, బొల్లు వెంకటేశ్వరరావు, కొప్పన రాజబాబు, మదినే దొరబాబు, లొండా లోవరాజు ఉన్నారు.

'విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి'

ప్రత్తిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంపకలోవ గ్రామంలో హిందూ దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని హిందూ ధర్మరక్ష సమితి అధ్యక్షుడు చేదులూరి గవరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని లంపకలోవలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో టీడీపీ నాయకుడు సహకారంతో పాస్టర్ దుర్మార్గపు కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, హిందువులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని దీనిపై జిల్లా పోలీసు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వన సమారాధనలు

జగ్గంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట గుర్రపాలెం రోడ్డులో తూర్పు కాపు సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లిరమేష్ హాజరవ్వగా శాలువాలు, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బద్దికొండ వెంకటరమణ, రాజనాల శ్రీను, ఎల్లపు దొరబాబు, జనసేన నాయకులున్నారు.

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడిలో కర్నాకుల వెంకటసూరిబాబు ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ఉసిరి చెట్టుకు పూజలు చేపట్టారు. జగ్గంపేట జనసేనఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.

జె.కొత్తూరులో డెంగ్యూ

జగ్గంపేట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.కొత్తూరు గ్రామంలో 13 ఏళ్ల నకిరెడ్డి వీరబాబుకు డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరబాబు జె.కొత్తూరులో ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. ఈ నెల 15న శాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపించగా డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీరబాబు ప్రస్తుతం కాకినాడ గవర్నమెంట్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు.

'మద్యం షాపు తొలగించాలి'

వీఆర్ పురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రేఖపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం షాపును వెంటనే తొలగించాలని... లేకపోతే గిరిజన, గిరిజనేతర మహిళలతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతానని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు

ఎటపాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు 1,780 టీడీపీ సభ్యత్వాలు నమోదయ్యాయి. గన్నవరం పంచాయతీ పరిధిలో 90 సభ్యత్వాలను టీడీపీ నేత బొల్లా పుల్లయ్య ఆధ్వర్యంలో నమోదు చేశారు.

రైతులు ఆందోళన చెందవద్దు : కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

తొండంగి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సమీపంలో బెండపూడి, పిఠ చిన్నయ్యపాలెం భూముల్లో ప్రతిపాదిత విమానాశ్రయం విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సోమవారం బెండపూడి వచ్చిన ఆయనను విమానాశ్రయ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో రైతులు కలిసి విమానాశ్రయ ప్రతిపాదన విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తయారైన ప్రతిపాదనను మాత్రమే తాను పంపానన్నారు. తదుపరి రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఈ విషయంలో రైతులు ఎటువంటి అపోహలకు లోను కావద్దన్నారు. రైతులకు తెలియకుండా ఏ ప్రయత్నం జరగదన్నారు. సమితి గౌరవాధ్యక్షుడు మద్దుకూరి సుబ్బయ్య చౌదరి పచ్చని పంట పొలాలను తీసుకుంటారేమోనన్న బెంగ రైతుల్లో నెలకొందని ఒక్కసారి వచ్చి తమ భూములను పరిశీలించాలన్నారు. రెండు పంటలు పండే భూములు తీసుకుంటే తీవ్రంగా నష్టపోతామని తమ పక్షాన ఆలోచించాలని కోరారు. సాధనాల నూకరాజు, రాయవరపు ఆనంద్, పాలచర్ల భాస్కర్రావు, గొల్లు సత్యన్నారాయణ, గొంతిన నాగేశ్వరరావు, తంగెళ్ల శ్రీను ఉన్నారు.

రైస్‌మిల్లర్ల సంక్షేమానికి అంకితభావంతో కృషి

అట్టహాసంగా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన పిఠాపురం, తుని ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

పిఠాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్ల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలని కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొగలి అప్పారావు(నాని) సూచించారు. పిఠాపురం రైస్‌మిల్లర్స్ కల్యాణమండపంలో సోమవారం సాయంత్రం పిఠాపురం, తుని ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా గొల్లపల్లి తిరుపతిరావు(చినబాబీ), ఉపాధ్యక్షుడిగా గుండుబిల్లి పోలీసు(చిన్న), కార్యదర్శిగా శెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా మేడిపూడి రాజబాబు, జాయింట్ సెక్రటరీగా కీర్తి సూరిబాబు, గౌరవాధ్యక్షుడిగా రెడ్డి రాజా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారిని రైస్‌మిల్లర్లు అభినందించారు. సమావేశంలో నానితో పాటు కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పేకేటి నాగేశ్వరరావు, కొయ్యా మురళీ, కనిగిరి దివాణం, వెలుగుల బాబీ తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్ల ఏర్పాటు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్



అన్న క్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న నవీన్

జగ్గంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ స్ఫూర్తితోనే పేదలు కడుపునిండా అన్నం తినాలని అన్న క్యాంటీన్ల ఏర్పాటు జరిగిందని జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ తెలిపారు. జగ్గంపేట ఎన్టీఆర్ విగ్రహం వద్ద దాతల సహకారంతో టీడీపీ ఆధ్వర్యంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం జగ్గంపేట సత్యశ్రీ కేబుల్ నెట్‌వర్క్ అధినేత ఎలుబండి గంగరాజు (బుజ్జి) ఆర్థిక సాయంతో పేదలకు ఏర్పాటు చేసిన భోజనాలను జ్యోతుల నవీన్ పేదలకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, జిల్లా కార్యాలయ కార్యదర్శి బుర్రి సత్తిబాబు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి నీలం శ్రీను, నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షుడు బద్ది సురేష్, టీడీపీ యువనేత రాయి సాయి, టౌన్ సెక్రటరీ కోడూరి రమేష్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి తుమ్మల కిషోర్, మారిశెట్టి రాధా, కొత్త నాగపండు, ప్రేమ స్వరూప్ బుజ్జి, పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి



ధర్మవరంలో మహిళలతో మాట్లాడుతున్న రామ్‌కుమార్

ప్రత్తిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ చెప్పారు. మండలంలోని ధర్మవరంలో సోమవారం ఆయన పర్యటించి డ్వాక్రా మహిళలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మహిళల కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలోని వార్డు మెంబర్ గొనగాలగోపి అస్వస్థతకు గురి కావడంతో పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు, బీజేపీ నాయకులు నానిపల్లి శ్రీనివాస్, స్థానిక ప్రముఖులు అబ్బులు, దండ వీరబాబు, గవర వీరబాబు పాల్గొన్నారు.

బరువు తక్కువ శిశువుకు మెరుగైన వైద్య సేవలు

కూనవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని కూనవరం ప్రభుత్వాస్పత్రిలో తక్కువ బరువుతో జన్మించిన శిశువుకు వైద్యులు సేవలందించి పదిరోజుల్లో బరువు పెరిగేలా చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం లక్కవరం గ్రామానికి చెందిన పూసం సిసింద్రీ భార్య ధనలక్ష్మి సెప్టెంబరు 3న మగ శిశువుకు జన్మనిచ్చింది. పుట్టినప్పుడు 2.8 కిలోలు ఉండగా తర్వాత అనారోగ్యం కారణంగా బరువు తగ్గింది. దీంతో తల్లిదండ్రులు కూనవరం మండలం కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని నవజాత శిశు కేంద్రంలో ఈనెల 9న చేర్చారు. అప్పుడు శిశువు బరువు 2.3 కిలోలు మాత్రమే ఉంది. దీంతో ఎస్ఎన్‌సీయూ చిన్నపిల్లలు వైద్యురాలు డాక్టర్ ప్రజ్వల, పిడియాట్రిషియన్ డాక్టర్ కార్తీక్ పర్యవేక్షణలో వైద్యసిబ్బంది మెరుగైన వైద్యసేవలందించగా శిశువు బరువు 3.1 కిలోలకు పెరిగింది. సోమవారం వారిని డిశ్చార్జి చేయగా కూనవరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ బాబు, చిన్నపిల్లల వైద్యులు ఈ వివరాలు వెల్లడించారు.

సీలేరు నదిలో కార్తీక శోభ

మోతుగూడెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీలేరు నది తీరంలో భక్తులు సోమవారం తెల్లవారుజామున కార్తీక స్నానాలు ఆచరించి పూజలు చేశారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ కార్తీక దీపాలు వదిలారు. పొల్లూరు శివాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి పంచామృతాలు, నానావిధ పరిమళ పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రధానార్చకుడు కుమార్‌స్వామి శర్మ పూజలు చేశారు.



కార్తీక దీపాలు వదులుతున్న దృశ్యం

స్త్రీ నిధి సొమ్ములు స్వాహాపై విచారణ



బూరుగుపూడిలో విచారణలో పాల్గొన్న ఏపీఎం

కిర్లంపూడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి గ్రామంలో డ్వాక్రా యానిమేటర్ దుర్గ సుమారు రూ.22లక్షలు స్త్రీ నిధి సొమ్ములు స్వాహా చేసినట్టు డ్వాక్రా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై సోమవారం బూరుగుపూడి తల్లిపిల్ల భవనంలో కాకినాడ డీఆర్‌డీఏ అధికారుల ఆదేశాల మేరకు వెలుగు కార్యాలయ అధికారులు విచారణ చేపట్టారు. సుమారు 11 సంఘాల సభ్యుల నుంచి ఒకరికి తెలియకుండా ఒకరి దగ్గర సొమ్ములు మాయం చేయడంతో సభ్యులు గగ్గోలు పెడుతున్నారు. 3 నెలలుగా స్త్రీనిధి సొమ్ములు చెల్లించకపోవడంపై డ్వాక్రా యానిమేటర్‌ను ఏపీఎం నిలదీయగా సోమవారం చెల్లిస్తానని చెప్పి ఊరి వదిలి వెళ్లిపోయినట్లు సభ్యులు తెలిపారు. దీనిపై విచారణకు వచ్చిన ఏపీఎం వేదవతి మాట్లాడుతూ 2023 జూలై నుంచి ఇప్పటి వరకు స్త్రీనిధి సొమ్ములు జమకాలేదని అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. గ్రామసంఘ సభ్యులు ద్వారా కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తామన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

తొండంగి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బెండపూడి విశాలాక్షి సమేత విశ్వేశ్వరుని ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం,సహస్ర లింగార్చన, జ్యోతిర్లింగార్చన, లక్ష కుంకుమ పూజలను అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కొంగర విశాలాక్షి, భ్రమరాంబ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హాస్టళ్లు పరిశీలించిన పోలీసులు

గండేపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం, రామేశ్వరంపేటలోని లేడీస్ హాస్టళ్ల నిర్వహణ, పరిసరాలను సోమవారం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ పరిశీలించారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులతో మాట్లాడారు. సేఫ్టీ అండ్ సెక్యూరిటీ, సీసీ కెమెరాలు ఏర్పాటు, వాటి పనితీరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మహిళా రక్షక్ ద్వారా అందించే సేవలు మహిళా భద్రత, రక్షణ, చట్టాలపై వివరించారు. గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి'

గండేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళూరు, నీలాద్రిరావుపేట గ్రామాల్లో సోమవారం లే అవుట్ స్పెషల్ అధికారి, ఎంపీడీవో నాతి బుజ్జి, హౌసింగ్ అధికారు పర్యటించారు. హౌసింగ్ లేఅవుట్ల నందు గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు 2025 మార్చి 31లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని, లేదంటే సొమ్ము విడుదలకాదని తెలిపారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మేస్త్రీలను ఆదేశించారు. హౌసింగ్ ఏఈ బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో సదస్సు

గండేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో ఐ.క్వాడ్రా ఐ కనెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు, పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలపై చర్చించారు. నిపుణులు శ్రీనివాస్ యామ్మల, మోడెర్నా మాజీ వైస్ ప్రెసిడెంట్, షేక్ ఆసిఫ్ బాషా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, వెంకట్ మాచవోలు పరిశ్రమలో దారిచూపే సూచనలు అందించారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

గండేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.గోపాలపురం గ్రామానికి చెందిన జి.అప్పన్న సారా తయారు చేస్తుండగా గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు అరెస్టు చేశారు. అతడి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. అతన్ని పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా ఈనెల 29 వరకు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ చెప్పారు.

నేడు రుద్రహోమం

వై.రామవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యార్లగడ్డ సమీపాన శ్రీ విశాలాక్షి అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ గంగా శైవక్షేత్రంలో మంగళవరా మంగళవారం పాశుపత రుద్రాభిషేకం, రుద్ర హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకుడు పల్లాల వెంకటరమణారెడ్డి తెలిపారు. వేద పండితుడు పల్లావఝుల రామకృష్ణశర్మ పూజలు చేస్తారని ఆయన చెప్పారు.

మద్యం పట్టివేత

ఎటపాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేఎన్ పురం (కొత్తూరు నారాయణపురం) గ్రామంలో పాయం వెంకటేశ్వర్లు బెల్ట్ షాపు ద్వారా మద్యం అమ్మకాలు చేస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ కరి పార్థసారధి సిబ్బందితో వెళ్లి సోదాలు జరిపారు. నాలుగు బీర్లు, 10 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.4 వేల వరకు ఉంటుందని తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు.